ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జూన్ 16, 2019
స్నేహ
వాన చినుకు ఇట్టా తడిపితే...!



ఆర్చీ.. ఓ అచ్చెరువే...!

అదో టీనేజీ ప్రేమ కథ..! కులాంతర ప్రేమల కథ...! ఇక అలాంటి కథకు ప్రాణమైన పాత్ర హీరోయిన్‌ది. నటించడాలు, జీవించడాలు అనేవి చాలు... 'సైరాత్' సినిమా మాటెత్తితే తానే గుర్తొచ్చేలా ఆర్చీ పాత్రలో రింకూ రాజ్‌గురు రూపం మెదులుతుంది. ఆ పాత్ర లక్షణాలన్నీ విభిన్నమే..! ఆ అమ్మాయి బుల్లెట్ నడుపుతుంది.. భయం లేకుండా బావిలో దూకుతుంది.. ఇంకా ఎన్నో సాహసాలు చేస్తుంది. ఆటపట్టిస్తుంది.., అల్లుకుపోతుంది.., దుర్భర పరిస్థితుల్లో ధైర్యంగా ఉంటుంది... అందుకే తొలి సినిమాతోనే, అదీ ప్రాంతీయ చిత్రమైనా సరే..! దేశవ్యాప్తంగా క్రేజ్ దక్కించుకుంది. నటనలోనే కాదు, చదువుల్లోనూ ముందే..!

★ మహారాష్ట్ర సోలాపూర్ జిల్లాలోని అక్లంజ్ పట్టణంలో రింకూ పుట్టింది. తండ్రి మాధవ్ రాజ్‌గురు, తల్లి ఆశా రాజ్‌గురు. ఇద్దరూ ఉపాధ్యాయులే.

★ రింకూ 7వ తరగతిలో కల్చరల్ ప్రోగ్రామ్స్‌లో చురుగ్గా ఉండేది. అలా 9వ తరగతి చదువుతున్నప్పుడు 'సైరాత్' చిత్ర దర్శకుడికి ఆమె ప్రతిభ తెలిసింది. చిత్రంలోని పాత్రే కాదు, స్వాభావికంగానూ ఆమె ఎంతో ధైర్యంగా ఉండేది.

★ సినిమా షూటింగ్‌ల కారణంగా పదో తరగతికి స్కూల్‌కి వెళ్లకుండానే ఇంట్లోనే చదువుకుంటూ ఉత్తీర్ణురాలైంది.

★ టీనేజ్ ప్రేమ స్టోరీల్లో 'సైరాత్' మరాఠీ సినిమా 100 కోట్లు వసూలు చేసిన రికార్డు తెచ్చిపెట్టింది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడలోని రీమేక్ చేస్తున్నారు.

★ హీరోయిన్‌గా మంచి ఫేమ్ వచ్చినా చదువులపై నిర్లక్ష్యం చేయలేదు రింకూ. ప్రస్తుతం ఇంటర్మీడియట్‌లో 82 శాతంతో పాసైంది. భవిష్యత్‌లోనూ అటు సినిమాలను, చదువులను మేనేజ్ చేస్తూ బ్యాలన్స్ చేస్తుందట..!

★ చిన్నతనం నుంచీ డ్యాన్స్ అంటే ఎంతో ఇష్టం. ఇప్పటికీ రోజుకు ఓ గంటపాటు డ్యాన్స్‌ను ప్రాక్టీసు చేస్తుంటుంది. మెహందీ డిజైన్స్ పెట్టడం అంటే మహా ఇష్టమట. అంతేకాదు, రింకూకు డాక్టర్ అవ్వాలని ఆసక్తి.

★ తొలి చిత్రంలోనే జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. స్పెషల్ మెన్షన్, స్పెషల్ జ్యూరీ అవార్డులను సొంతం చేసుకుంది. ఆ తర్వాత 'మనసు మల్లిగె', 'కాగర్', 'ఝుండ్' వంటి మరాఠి చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం రింకూ కర్నాటకలోని బెల్గామ్‌లో తీస్తున్న మరాఠీ చిత్ర షూటింగ్‌లో బిజీగా ఉంది.

సెలవులు అయిపోయి తిరిగి స్కూల్‌కు వెళ్లే సమయం వచ్చేసింది. మీరు మీ స్నేహితులతో కలిసి సరదాగా సాయంత్ర సమయంలో ఆడుకునేందుకు ఎంతగానో అనువుగా ఉండే ఆట రూనేబాల్. ఈ ఆటను 2006లో రాయ్ బిర్నే కనిపెట్టారు. ఇందులో రెండు టీములుంటాయి. ఒక్కో టీములో నలుగురు ఆటగాళ్లుంటారు. అరవై అడుగుల స్థలంలో ఆడతారు. అందులో ఒక్కో టీమ్‌కు 30 అడుగుల స్థలం. ఈ ఆటకు కావాల్సింది ఒక బాస్కెట్ బాల్.. ఒక్కో ఆటగాడికి ఒక్కో చెక్కబ్యాట్. దాన్నే ఈ ఆటలో రూనేకత్తి అని పిలుస్తారు. కత్తి అంటే క్రికెట్ బ్యాట్ అంత పొడవుగా చెక్కతో తయారు చేసింది. ఓ పక్క కొంచెం కత్తిలా మరోపక్క పట్టుకోడానికి వీలుగా ఉండేలా దీనిని తయారు చేస్తారు. ఆ కర్రకత్తి చేతిలో నుంచి జారిపోకుండా ఉండటానికి గ్లౌజ్‌ను ధరిస్తారు. ఒక్కో టీమ్‌కు ఎనిమిది పాయింట్లు ఉంటాయి. ఏ టీమ్ అయితే ఆటను ప్రారంభిస్తుందో ఆ టీమ్ ఆ కత్తితో బాల్‌ని ప్రత్యర్థులకు అందకుండా చూడాలి. అప్పుడు ప్రత్యర్థి టీమ్ వాళ్లు ఆ బాల్‌ని చేతిలో ఉన్న కత్తితో బాల్‌ని తాకితే పాయింట్ వస్తుంది. ఈ విధంగా ఈ ఆట సాగుతుంది. అయితే ఆటగాళ్లు బాల్‌ను కేవలం ఆ రూనే కత్తితోనే తాకాలి. అలా తాకినవారికి పాయింట్లు వస్తాయి. ఆ క్రమంలో బాల్‌ని చేత్తో పట్టుకుంటే ఆ ఆటగాడు ఆట నుంచి తొలగిపోతాడు. ఈ విధంగా 20 నిమిషాల పాటు ఈ ఆట ఇద్దరి జట్ల మధ్య ఎంతో సరదాగా సాగుతుంది. ఈ ఆటను తొమ్మిదో తరగతి నుంచి కాలేజీ విద్యార్థుల వరకూ ఆడుకోవచ్చు. ఈ ఆటను ఎక్కువగా ఆస్ట్రేలియాలో విద్యార్థులు వర్షంలో తడుస్తూ సరదాగా ఆడుతుంటారట..! మనకు రాబోయేది వర్షాకాలమే కాబట్టి మీరు ఈ కొత్త ఆటని మీ స్కూల్ లేదా కాలేజీల్లో ప్రారంభించండి.

చెక్క కత్తితో బంతాట..!

అట్టమీది కథ 6

వాన చినుకు అట్టా తడిపితే..

బొమ్మల బండి ... 2
ఇదీ జీవితం

ఓ స్వప్నం..! 5
విహారం

శాంతి నగరం ... 11
యమహా నగరీ

ఆలనగా.. లాలనగా ... 14
కథ

జీవన పాఠం ... 17
బాలల కథ

డిప్రెషన్ ... 19
సైన్స్ కథ

స్నేహమే సాహసంగా 24
సుచిత్రం

సందర్భం ... 12
వ్వా..! దేశీ వాద్యం...!

అంటార్కిటికాలో ఏ విధమైన మార్పులు చోటు చేసుకున్నా వాటి ప్రభావం ప్రపంచమంతటా పడుతుందని శాస్త్రవేత్తలు దానిపై నిత్య అధ్యయనాలు చేస్తూనే ఉంటారు. మంచు ఉపరితలంపై ఏర్పడిన హోల్స్‌ను 'పోలీన్యా'లు అంటారు. ఇవి కొన్ని రోజుల తర్వాత కలిసిపోతాయి. ఇటీవల శీతకాల సమయంలో ఏర్పడిన పోలీన్యాలపై అధ్యయనం చేశారు ఇథాన్ కాంప్‌బెల్. వేగంగా అధ్యయనం చేసేందుకు రోబోటిక్ డ్రిఫ్టర్లతో పాటు, సీల్స్‌కు సెన్సార్లను అమర్చి మరీ పరిశోధన చేశారు. మహాసముద్రాల అసాధారణ పరిస్థితులు, వెడెల్ సముద్ర తీరంలో ఏర్పడిన తీవ్ర తుపానుల గాలులు కారణంగా ఇవి ఏర్పడి ఉండొచ్చని అంచనా. 2016లో మూడు వారాల పాటు 33,000 చదరపు కిలోమీటర్లు, 2017లో 50,000 చదరపు కిలోమీటర్ల మేర గ్యాప్ ఏర్పడినట్లు నాసా వెల్లడించింది. గతంలోనూ ఇటువంటి పోలీన్యాలు 1974లో న్యూజిలాండ్ పరిమాణమంత దృశ్యాలు శాటిలైట్‌కు చిక్కాయి.



బొట్టు కాటుకెట్టి
మంచి బట్టలేసి
నాతో బడిదాక బోలెడన్ని
నాకు చిట్టి ముద్దులిస్తూ తోడే వస్తాడు
నీ నవ్వు చూసేటి మీ నాన్న కన్నుల్లో
ఆనంద బాష్పాలే
నీ కంట నీరొస్తే ఆ గుండె లోతుల్లో నిత్యం
మంటల్లే
పసితనం అంతా ఎదిగినా కానీ
మీ నాన్న ముందు నువ్వు
విరియని తామర పువ్వేనంటా
ఎంత అల్లరినైనా కానీ
అది ఒక కమ్మని దోబూచాట
మెరిసే మబ్బుల నుంచి పున్నమల్లే నవ్వే నాకై
వరమై వస్తాడా నాన్న

గీతం : మెరిసే మబ్బుల నుంచి..
రచన : వనమాలి
చిత్రం : కనుపాప

సాఫీగా సాగిపోయే జీవితం
కోసం పాకులాడకు..
తట్టుకుని నిలబడే బలం
కోసం ప్రయత్నించు...!

\- బ్రూస్ లీ

తను జీవితాన్ని తాము జీవించడం పిల్లల విధి.
ఆందోళనతో ఉండే తల్లిదండ్రులు
కోరుకుంటున్నట్లు.. విద్యావేత్త ఆశించినట్టు
కాదు.

\- ఎ.ఎస్.నీల్

9-6-2019 నాటి స్నేహ సంచికలో వచ్చిన 'బడి గంట మోగేవేళ..' వ్యాసం తల్లిదండ్రుల్ని ఎంతగానో ఆకట్టుకుంది. స్కూల్స్‌కి వెళ్లేముందు అందరినీ మేల్కొలిపేలా మంచి వ్యాసాన్ని అందించారు. 'బాలల కథ', 'ఇదీ జీవితం' చాలా బాగున్నాయి. 'జ్ఞాపిక' కథాకర్తకు ధన్యవాదాలు. అంత చిన్న వయసులోనే ధైర్యంగా ప్రపంచాన్ని చుట్టొచ్చిన 'అలెక్సిస్' మా ప్రత్యేక అభినందనలు.

\- కొడాలి సరిత, భట్ల పెనుమర్రు

స్నేహ సంచిక 'అట్టమీది కథ' చాలా బాగుంది. పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, పెద్దలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చక్కగా వివరించారు. 'కవిత్వాలు' చాలా బాగున్నాయి. 'అడవి దగ్గరి నగరం' ఆలోచింపజేసింది. రచయితలకు మా ధన్యవాదాలు.

\- నాతి లక్ష్మీశ్రీ, ద్రాక్షారామం

అసోంలోని ఓ పాఠశాలలో చిన్నారుల నుంచి ఫీజుగా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థుల నుంచి వారానికి కనీసం 25 ప్లాస్టిక్ బాటిళ్లను ఫీజుగా వసూలు చేస్తోంది.. నిర్వాహకురాలు పర్మితా శర్మ, ఆమె మరికొందరితో కలిసి పేద చిన్నారుల కోసం అక్షర్ ఫోరం అనే పాఠశాలను స్థాపించారు. చలికాలంలో వెచ్చదనం కోసం ప్లాస్టిక్ బాటిళ్లతో చలిమంట వేసుకుంటున్నామని విద్యార్థులు చెప్పడంతో ఈ కొత్త ఫీజు విధానం తెచ్చారట. అయితే, ఇలా సేకరించిన ప్లాస్టిక్ బాటిళ్లలో మట్టి నింపి వాటిని ఇటుకల్లా పేరుస్తూ చెట్ల చుట్టూ గోడలు కడుతున్నారు. వాటితో చిన్న వంతెనలు నిర్మించాలని అక్షర్ ఫోరం భావిస్తోంది. ప్లాస్టిక్‌ను తగులబెట్టడం ద్వారా కలిగే హాని గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు కూడా వివరిస్తున్నారు.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా : స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం : 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.

మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmaii.com

ఇదీ జీవితం

బొమ్మల బండి

- కేఆర్టీ
98495 68901

'బొమ్మలూ.. రంగురంగుల బొమ్మలూ..' చక్రాలబండి నెట్టుకుంటూ భద్రయ్య కేకలు పెడుతున్నాడు. వీధుల్లో జనం అట్టేలేరు. రుతుపవనాల్లోనూ ఎండలు బాటసారుల నెత్తి మాత్రం మాడ్చేస్తున్నాయి.

భద్రయ్య ఆరోగ్య భద్రతకి అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాడు. చెంపల మీద నుంచి కందుకూరి తలపాగా చుట్టాడు. బండి కింద జోలెలో మంచినీళ్ల సీసా పెట్టింది ముసలావిడ. చిన్న సత్తుబరిణెలో నీళ్లమజ్జిగ పోసిచ్చింది. ఎండదెబ్బ తగలకుండా మధ్యమధ్యలో తాగుతుండమని హెచ్చరించింది.

మనిషి అరవైయేళ్ల ముసలాడయ్యాడు కానీ, మనసింకా వయసులోనే ఉంది. ఒకప్పుడు ఎంత బరువునైనా తేలిగ్గా మోసుకెళ్లేవాడు ఇంకా, మొయ్యాలనిపిస్తుంది కానీ, ఇప్పుడది జ్ఞాపకంగా మిగిలింది. బతుకు బరువు మోయటమే కష్టంగా ఉంది.

భద్రయ్యకి ఇద్దరు కొడుకులు. ఒకడు ఆటో డ్రైవరు, రెండోవాడు మోటారు మెకానిక్. పెళ్లిళ్లు చెయ్యగానే రెక్కలు వచ్చిన పక్షుల్లా ఎగిరిపోయారు. ఇప్పుడు ఎవరి గూడు వాళ్లదే. భద్రయ్యకి పాత గూడు మిగిలింది.

పెళ్లయ్యే వరకు కొడుకులుగా ఉండేవాళ్లు.

వేరు కాపురాలు పెట్టుకున్నాక చుట్టాలుగా మారిపోయారు. ఎప్పుడో బుద్ధి పుట్టినప్పుడు చూసివెళ్తారు. తల్లితోనే ఎక్కువ మాట్లాడి 'వెళ్నొస్తా'నని చెప్పి వెళ్లిపోతారు. భద్రయ్యకి బాధనిపిస్తుంది. తను వాళ్లని ఎంత ప్రేమగా పెంచాడు. తను తినేది కూడా వాళ్లకే పెట్టేవాడు. ముఖ్యంగా మామిడిపళ్లు. ఎంత ఖరీదైనా కొని తెచ్చేవాడు. వేసవి దాటితే రసాలు దొరకవు కదా!

భద్రయ్య ప్రేమంతా రసాల్లో నిండిపోయేది.

వాళ్లు తృప్తిగా తింటే తన కడుపు నిండినట్లు సంతోషించేవాడు. ఇప్పుడు రసం పీల్చేసిన మామిడి టెంకలా పిల్లల ప్రేమ దక్కని మనసుతో మిగిలిపోయాడు భద్రయ్య.

అన్నం తినే ముందు విస్తరి, తిన్నాక ఎంగిలాకులా ఆత్మీయతలు మారిపోయాయి. అనుబంధాలకు అర్థమే లేకుండా పోయింది. స్వార్థమే పరమావధిగా మారిపోయింది. భద్రయ్యకి అలసటగా అనిపించి చెట్టు నీడలో ఆగాడు. గతంలో ఈ బజారులో చాలా చెట్లుండేవి. ఇప్పుడు అక్కడక్కడా ఉన్నాయి. బాధగా అనుకున్నాడు. చెట్లుకన్నా మనిషికి మంచి బంధువులెవరు?

ఎండకీ, వానకీ గొడుకు పట్టేది చెట్లేకదా?

దిక్కులేని పక్షులకు ఆశ్రయం ఇచ్చేవి చెట్లే కదా? ఎందుకలా చెట్లని హత్యలు చేస్తారు. వాటికి నోరు లేకపోవచ్చు.. మనసు ఉండదా? కాసిని మజ్జిగ నోట్లో పోసుకుని మళ్లీ చెట్టునీడలోంచి ఎండలోకి నడిచాడు భద్రయ్య..

'బొమ్మలూ.. రంగురంగుల బొమ్మలూ..'

••

'ఇవేళ ఏ మాత్రం అమ్మావూ?' తాగటానికి మంచినీళ్లిస్తూ అడిగింది ముసలమ్మ.

'పెద్దగా అమ్ముడుపోలా.. ఒక అరవై రూపాయలు అంతే' నిట్టూరుస్తూ మంచినీళ్లు ఎత్తి గొంతుకలో పోసుకున్నాడు భద్రయ్య.

'ఇంట్లో బియ్యం లేవు. సరుకులు తేవాలి.' ధరలు మండిపోతున్నాయి. ఏం కొంటాం.. ఏం తింటాం.. ఏం బతుకుతాం..!' దిగులుగా అంది ముసలమ్మ.

'బతికినన్నాళ్లు బతుకుతాం. మనం లేకపోయినా ప్రపంచానికి లోటేముంది? చిన్నప్పుడు రైలుని చూస్తూ అనుకునే వాణ్ణి. నేను ఎక్కకుండా ఎలిపోతోందేంటని..? ఏదీ ఎవరికోసం ఆగదు. ప్రపంచం నడుస్తూనే ఉంటుందే ముసిల్దానా' చాప మీద నడుం వాలుస్తూ అన్నాడు భద్రయ్య.

'నాలుగిళ్లలో అడుక్కొచ్చా.. అదే మనకి బువ్వ..'

నవ్వేడు భద్రయ్య.

'నాకంటే నీ పనే బాగుందే. కష్టపడకుండా బువ్వ సంపాదించావు'

'అడుక్కోవటం అంత తేలిగ్గాదు. మనసు చంపుకుని అడగాల.. ఒకసారి అడుక్కో.. నీకే తెలుస్తుంది' ఉక్రోషంగా అంది ముసలమ్మ.

మళ్లీ నవ్వేడు భద్రయ్య.

'నిజమేలేవే. నీకష్టమే నాకు ఎక్కువ. అలా కోప్పడబాక. నీ కోపం చూస్తే నాకు భయమేస్తది..' చతురులాడాడు.

ముసల్ది ఆ మాటకి పకపక నవ్వేసింది.

'అమ్మయ్యా! వాన వెలిసింది' అన్నాడు తనూ నవ్వుతూ.

• •

'తాతా! ఆగాడు.. నాకు బొమ్మ కావాలి' బుట్ట బొమ్మలా బొద్దుగా ముద్దుగా ఉన్న అయిదేళ్ల పాప పరుగున వచ్చింది బండి దగ్గరకి.

భద్రయ్య బండి ఆపాడు. పిల్లకేసి ముచ్చటగా చూస్తూ 'చూసుకో నీకే బొమ్మకావాలో..' అన్నాడు. పెద్దపెద్ద కళ్లతో బండి చుట్టూ తిరుగుతూ ఒక్కొక్క బొమ్మనీ చూపుడు వేలితో తాకి చూస్తూ, కిలకిల నవ్వుతూ..

'భలే ఉన్నాయి బొమ్మలు' అంది సంబరపడిపోతూ.

కాసేపు బొమ్మల ఎంపికలో తడబడి చివరికి రెండు బొమ్మలు తీసుకుంది. ఒకటి ఏనుగు. రెండోది నెమలి. వాటిని హత్తుకుంటూ 'థ్యాంక్యూ తాతా..' అంది.

'మరి డబ్బులియ్యవా?'

'ఎంత?'

'రెండూ కలిసి ఇరవైరూపాయలు..'

'అమ్మో అంత డబ్బులు నా దగ్గరలేవు..!'

'ఎంతుంది?'

'పది రూపాయలు..'

'సరే ఇవ్వు..'

ఫ్రాకులోంచి డబ్బులు తీసే ప్రయత్నంలో ఏనుగు బొమ్మ జారిపడి ముక్కలైంది. పిల్ల భయంతో గాబరా పడిపోయింది. ఏడుపు మొహం పెట్టి 'సారీ తాతా' అంది చమరుస్తున్న కళ్లతో.

'బొమ్మ బండిమీద పెట్టి డబ్బులు తీయాలి. నెమలి బొమ్మ బండిమీద పెట్టి డబ్బులు తియ్యి..'

అలాగే చేసింది.

తళతళ మెరుస్తున్న పదిరూపాయల బిళ్ల చేతిలో పెట్టింది.

నెమలి బొమ్మ తీసుకుని దీనంగా వెళ్తుంటే జాలివేసి వెనక్కి పిలిచాడు. ఇంకొక ఏనుగు బొమ్మతీసి చేతిలో పెట్టాడు. ఆ పాపకళ్లు ఆనందంతో మెరిసిపోయాయి.

'మెనీ మెనీ థ్యాంక్స్ తాతా' అంది పొంగిపోతున్న సంతోషంతో.

'మంచిది. జాగ్రత్తగా వెళ్లు. బొమ్మలు జాగ్రత్త' అన్నాడు నవ్వు మొహంతో. తన మనమరాలికే ఇచ్చినంత తృప్తి అనిపించింది. 'ఎన్ని బొమ్మలు అమ్మి, ఎంత లాభం వచ్చినా ఇంత ఆనందం తృప్తి కలుగవు.'

భద్రయ్య బండి ముందుకు తోసుకుంటూ పదడుగులు నడిచాడు. అంతే తుపానులా దూసుకొచ్చిన మోటారు సైకిల్ బొమ్మల బండిని ఢీకొట్టింది. బండిని చేతుల్తో పట్టుకున్న భద్రయ్య బండితో పాటు ఎగిరి అవతల పడ్డాడు. తలకి గట్టిదెబ్బ తగిలింది. బండి తల్లకిందులైంది. బొమ్మలు చెల్లాచెదురుగా పడ్డాయి. సగంపైగా బొమ్మలు పగిలినందుకు ఎక్కువ బాధనిపించింది.

మోటారుసైకిల్‌తో పాటు కిందపడ్డ కుర్రాడు.. తగిలిన దెబ్బలు పట్టించుకోకుండా, గబగబ బండి స్టార్టు చేసి 'సారీ తాతా' అంటూ దూసుకుపోయాడు.

పట్టుకుందామని పరుగున వస్తున్న పోలీసు మధ్యలోనే నిలబడిపోయి 'తాగుబోతు నాయాలా..! ఎక్కడో పడి చస్తావురా' అని కేక పెట్టాడు. కుర్రాడు నవ్వు మొహంతో వెళ్లిపోయాడు.

పోలీసు భద్రయ్యని లేవదీశాడు. పాదచారులు బండిని నిలబెట్టి, రోడ్డుమీద పడిన బొమ్మలు, పగిలిన ముక్కలు సర్దారు. ఇంటిదాకా సాయం రావడానికి ఎవరో ముందుకొచ్చారు.

• •

'బొమ్మలతో పాటు మన బతుకు కూడా ముక్కలయిందయ్యా' పగిలిపోయిన బొమ్మలు వేరు చేస్తూ అంది ముసలమ్మ కన్నీరు కారుస్తూ. వంటి నిండా దెబ్బలతో మంచం మీద కట్టెలా పడుకున్నాడు భద్రయ్య. మాట్లాడే ఓపిక లేక కన్నీళ్లు కార్చాడు.

'ఇక రోజులెలా గడుస్తాయో..' దిగులుగా అంది ముసలమ్మ. ఆ పొద్దంతా మొగుడికి సేవలతోనే సరిపోయింది. మందులకొట్లో కొనుక్కొచ్చిన మందులు తినిపించింది. డాక్టరు ఫీజుతో మందులొస్తాయని బీదవాళ్లంతా మందులకొట్లో మందులే వాడతారు.

ముసలమ్మ కూడబెట్టిన డబ్బులు ఇప్పుడు అక్కరకొచ్చాయి. వాటితోనే మందులు కొంది. అవి వేసుకున్నాక మర్నాటికి భద్రయ్యకి కాస్త బాధలు తగ్గినట్లనిపించింది. లేచి కూర్చుని 'ఎన్ని బొమ్మలు మిగిలాయే?' గోడ దగ్గర సర్దిన బొమ్మల్ని చూస్తూ అడిగాడు భద్రయ్య.

'నువ్వే చూడు..' విరక్తిగా అంది ముసలమ్మ.

ముక్కలు వేరు చేసి, మంచి బొమ్మలు లెక్కపెట్టాడు. ముప్పై దాకా లెక్కతేలాయి. ముక్కలు పెళ్లానికిస్తూ 'అవతల పారెయ్యి' అన్నాడు. ముసలమ్మ పారేసి వచ్చింది.

'గంప తీసుకురా..' అన్నాడు. ముసలమ్మ తెచ్చింది. దాంట్లో బొమ్మలన్నీ జాగ్రత్తగా సర్దాడు.

'ఇవన్నీ ఏంచేస్తా?' కుతూహలంగా అడిగింది.

'ఇంట్లో కూర్చుంటే రోజులెలా గడుస్తాయ్? రేపట్నుంచి గంపనెత్తిన పెట్టుకుని, బజార్లో బొమ్మలమ్ముకొస్తా..'

ముసలమ్మ మొగుడ్ని చూస్తుండిపోయింది.

✦





వారిది పచ్చనిల్లు..!

వారికి ప్రకృతంటే మహా ఇష్టం. గాలి, కాంతి, నీరు, మొక్కలు తమ బిడ్డలు. జీవన విధానంలో మార్పులు చేసుకుని సంవత్సరానికి లక్ష లీటర్లకు పైబడి నీటిని ఓ వృద్ధ జంట ఆదా చేస్తున్నారు. వారి ఇంటి నీటి బిల్లు సున్నా. వారి ఇంటి విద్యుత్ బిల్లు సాధారణ కుటుంబంతో పోల్చుకుంటే ఒక వంతు మాత్రమే వస్తుంది. వారిరువురూ ఇంట్లో పర్యావరణానికి హానికరమైన ఏ వస్తువూ కొనరు. వారి ఇల్లు ఓ బృందావనం, ఊటీని తలపించే వాతావరణం అక్కడ దొరుకుతుంది.

1990లో విశ్వనాథ్ తన భార్య చిత్రలిద్దరూ కలిసి ఇంటికోసం వెతకడం ప్రారంభించినప్పుడు వారి అభిరుచికి తగిన విధంగా ఓ ఇంట్లో చేరారు. అప్పుడు వర్షాకాలం కావడంతో వరద వచ్చి వారి ఇంటి పక్కన ఉన్న ఇళ్లు పూర్తిగా మునిగిపోయాయి. ఓ పక్క బెంగుళూరులో నీటి కొరత మరో పక్క వృధాగా పోతున్న వరద నీరు చూసి అందుకు చెక్ పెట్టాలనుకున్నారు.

ప్రకృతికి దగ్గరగా..

విశ్వనాథ్ సివిల్ ఇంజినీర్, చిత్ర రీజనల్ ప్లానర్‌గా పనిచేశారు. భార్యాభర్తలిద్దరూ పర్యావరణానికి అనుకూలంగా ఉండే విధంగా ఇంటిని నిర్మించాలనుకున్నారు. అందుకు ముందుగా ప్రకృతి నుంచి సహజ సిద్ధంగా వచ్చే సూర్యరశ్మి, గాలి, నీటిని వృధా కానివ్వకూడదని భావించి ఆ విధంగా తమ ఇల్లు ఉండాలని డిజైన్ చేసుకున్నారు. అయితే ఎటువంటి వాతావరణాన్నైనా తట్టుకునే విధంగా ఉండేలా నిర్మాణం చేయించుకోవాలనుకున్నారు. ఎక్కువ గాలి వీచేందుకు అవకాశం ఉంటుందని భావించి అందు కోసం రెండంతస్తుల మేడను డిజైన్‌చేశారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టి..!

టాయిలెట్, రోజువారీ నీటి వాడకం, గార్డెనింగ్ ఈ నాలుగు పద్ధతులకు వర్షం ద్వారా వచ్చే నీటిని వాడాలనుకున్నారు. వారు ప్రస్తుతం నిల్వ చేస్తున్న నీరు పది నెలల పాటు ఇద్దరికీ సరిపోతోందట..! అనుకున్నట్లే సహజమైన గాలి, కాంతి, డిజైన్ తలుపులు బదులుగా ఓపెన్ వంపుల వంటివి పెట్టి కాంక్రీట్, సిమెంట్‌ను తగ్గించి చెక్క, పెంకులు, ఇంటి నిర్మాణానికి వాడారు. విద్యుత్ కోసం సౌర శక్తి ఫలకాలను ఉపయోగించారు. ప్రతి గదిలోకి గాలి విస్తారంగా వీచేందుకు ఒంపు గోడలను నిర్మించారు.



ఊటీని తలపిస్తూ..

ఎండాకాలం సైతం ఊటీని తలపించే విధంగా వారి ఇంట్లో ఉంటుంది. వారి ఇంటికప్పుపై ఎండిన ఆకులను వేసి నిల్వ ఉంచారు. వర్షాకాలం అయిపోయిన తర్వాత వాటిని చెట్ల మొదల్లో వేయడం ద్వారా ఎరువుగా ఉపయోగపడేది. వర్షపు నీరును నిల్వ చేసేందుకు వారి ఇంటి నిర్మాణంలో దాదాపుగా లక్ష లీటర్ల నీరు పట్టే విధంగా వివిధ రూపాల్లో ఏర్పాటు చేశారు. బంగాళాదుంపలు, ఆకుకూరలు, పండ్లు దాదాపు అన్ని రకాలు సేంద్రీయ ఉత్పత్తులను పెంచుతున్నారు. వాటికి బూడిద, కుళ్లిపోయిన ఆకులు మొక్కలకు ఎరువుగా వేస్తున్నారు. ఈ నీటి వాడకం కూడా ఒక క్రమపద్ధతిలో నీరు మొక్కలకు చేరే విధంగా వాడకాన్ని అమర్చుకున్నారు. బట్టలుతకడానికి వంట సోడా వాడటం వల్ల ఆ నీరు మొక్కలకు హాని చేయవు.

నలుగురికీ తెలుపుతూ..

చేస్తున్న ప్రతి పనిలోనూ వెయ్యి లీటర్ల నీటి వాడకం ఆదా అయ్యేలా డిజైన్ చేసుకున్నారు. రోజువారీ వాడకానికీ, మొక్కలకు ఎంతగానో ఈ పద్ధతి అనుకూలంగా ఉంది. ఈ విధంగా వీరు అటు పర్యావరణాన్ని రక్షిస్తూ.. ఇటు నీటిని ఆదాచేస్తూ.. ప్రకృతికి దగ్గరగా జీవిస్తూ ఎంతో ఆనందాన్ని పొందుతున్నారు. వీరు ఈ పద్ధతిని బెంగుళూరులోని నివాసం ఉంటున్న వారికి ప్రచారంలో పెట్టి ఎందరికో అవగాహన కల్పిస్తున్నారు. బెంగళూరులో పర్యావరణ అనుకూలమైన ఇల్లు గురించి ప్రతి ఒక్కరూ మాట్లాడుకోవడమే కాకుండా కొందరు ఈ విధంగా ఇంటిని మార్చుకోడానికి ముందడుగు వేశారు. రానున్న కాలంలో ఇటువంటి పర్యావరణ హితమైన ఇళ్ల నిర్మాణంలోకి రావాలని కోరుకుందాం..!

- ఐక్యత

ఓ స్వప్నం..!

చిన్న కథ

- పద్మజ
99896 39436

రోజులాగే ఈ రోజు కూడా పొద్దున్నే దినపత్రిక చదివాను. ఒక వార్త ఐదేళ్ల చిన్న పాపని దేముడికిచ్చి పెండ్లి జరిపిస్తున్నారు. ఈ వార్త నన్ను కలవర పెట్టడం మొదలెట్టింది. నా దినచర్యలు రొటీన్‌గా చూస్తూనే ఆలోచిస్తూనే పడుకున్నాను.

ఒక్కసారిగా నిద్రలో మెలకువ. ఆ చిన్న పాపను నేనే..! గట్టిగా ఏడుస్తున్నాను. 'నాకు పెళ్లి వద్దు నాన్న చదువుతాను, బడికి వెళ్తాను' అని గట్టిగా అరుస్తున్నాను. అయినా, పట్టు వదలని మా నాన్న నన్ను పెండ్లి పీటలపై కూర్చోబెట్టారు. పక్కన ఉన్న పెండ్లి కొడుకు నలభై ఏండ్ల మా అమ్మ తమ్ముడే. నా ఏడుపు ఇప్పుడు ఇంకొంచెం పెద్దదయ్యింది. మండపం నుంచి లేచి పరిగెట్టడం మొదలుపెట్టాను. ఎక్కడికి, ఎందుకు, ఎవరికోసం నాకే తెలియదు. ఒకటే పరుగు, ఆయాసం, కాళ్లనొప్పులు... అయినా, పరుగు ఆగలేదు.

ఆశ్చర్యం!

ఎదురుగా ఒక పెద్దమనిషి. నన్ను అక్కున చేర్చుకొని 'భయపడకు. నేను ఉన్నాను' అని నా భుజం తడుతున్నాడు. ఆయన మాటలు నాకు ధైర్యం కల్గించాయి. మెల్లగా ఏడుపు ఆపి ఆయన చెప్పింది వినడం మొదలెట్టాను. 'ధైర్యంగా ఉండు నిన్ను వారికి అప్పజెప్పను. బాగా చదువుకోనిస్తాను.' అంటున్నాడు ఆయన. నీకు ఇప్పుడు ఎవ్వరూ పెండ్లి చెయ్యరులే అని భరోసా ఇస్తున్నాడు. 'పద.. వేగంగా నడు. వాళ్లు వెంబడిస్తున్నారు.' అని అంటూ ముందుగా అడుగులు వేస్తున్నాడు. ఆయన వెంట నేను కూడా అదే వేగంతో వెళుతున్నా.

మా వెనుక నుంచి మాటలు, కొందరి అడుగుల శబ్దం దగ్గరవుతోంది. వాళ్లు గట్టిగా అరుస్తున్నారు. 'పాప ఆగు! అతని చెయ్యి వదిలిరా! అతను సంఘ విద్రోహి, నిన్ను చంపేస్తాడు' అని అరవడం వినిపిస్తోంది. వాళ్లు ఆయనపై రాళ్లు విసరడం ప్రారంభించారు. ఎందుకో.. నేను ఇంకా గట్టిగా ఆయన చెయ్యి పట్టుకుని ముందుకే సాగుతున్నాను. అంతా దట్టమైన అడవి, చిమ్మ చీకటి. దారి సరిగ్గా లేదు. అయినా నేను అతని చేయి వదలలేదు. 'భయపడకు.. వేగంగా నడు..' అంటూ ఆయన నన్ను నడిపిస్తూనే ఉన్నాడు. రాత్రంతా నడుస్తూనే ఉన్నాను.

కొంతసేపటికి మరికొందరు మమ్మల్ని కలిశారు. 'పదండి గురువుగారు మీతో మేము కలిసి వస్తాము' అంటున్నారు. మరలా అందరం ప్రయాణం ముందుకి సాగిస్తున్నాం. దూరంగా కొంత వెలుగు కనిపిస్తోంది. సూర్యుడి వేడి నాకు చుర్రుమని తగులుతుంది.

ఆశ్చర్యంగా నాకు ఉదయం 7 గంటలకు మెలకువ వచ్చింది. వళ్లంతా చమటలు పట్టి ఉన్నాను. నా దగ్గర నేనే ఉన్నాను. పరుగూ లేదు, పెండ్లి మండపం లేదు. ఇదంతా కల అన్నమాట! హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నాను. కల గురించి ఆలోచిస్తూనే పక్కనే ఉన్న పత్రిక తీసి యథాలాపంగా చూస్తున్నాను.

రెండో పేజీలో వార్త 'కందుకూరి వీరేశలింగం శతజయంతి ఉత్సవాలు అని. జరిగేది మా ఇంటికి దగ్గరే ఉన్న సిద్ధార్థ కాలేజీలో. ఆయన గురించి చాలా రాశారు. పత్రికలోని ఆయన ఫొటోవైపు నా దృష్టి మళ్లింది. ఆశ్చర్యం! నేను కలలో చేయి పట్టుకొని పరిగెట్టిన వ్యక్తి .. ఈయనా ఒక్కలాగే ఉన్నట్లు అనిపించింది.

అయినా నేను కష్టపడి చదువుకున్నాను. ఉద్యోగం వచ్చింది. మంచి భర్త ఉన్నాడు కదా? నాకేమిటి ఈ కల? అని ఆలోచిస్తూ అమ్మ ఇచ్చిన 'టీ' తాగుతూ... ఈ వీరేశలింగంగారి గురించి అమ్మతో మాట్లాడాను. ఆమె అప్పుడు ఆయన గొప్పతనం గురించి, మా అమ్మమ్మ ఈయన ఉపన్యాసాల నుంచి పొందిన స్ఫూర్తి గురించి చెప్పారు. ఆ స్ఫూర్తితోనే మా అమ్మగారికి 'శారదా చట్టం' ప్రకారం 18 ఏళ్ల వయస్సు వచ్చాక వివాహం చేశారని చెప్పారు. ఆ కాలంలో చాలామంది ఆడవాళ్లు ఆయన చేసిన మంచిపనులను చూసి, చెప్పిన మంచిమాటలను విని స్ఫూర్తి పొందారని... తమ ఆలోచనలలో, ఆచరణలలో మార్పులు చేసుకున్నారని చెప్పారు. వారిలో మా అమ్మమ్మ ఒకరు. మా అమ్మ కూడా అదే బాట నడిచారు. అమ్మ ప్రోత్సాహంవల్లే మేము నలుగురు ఆడపిల్లలం చదువుకోగలిగాం. అప్పటి మా ఇంటి వాతావరణం జమిందారీ పద్ధతిలో ఉండేది. వాటిని ఎదిరించి మా నాన్నతో, మేనత్తలతో పోట్లాడి మమ్మల్ని చదివించారు అమ్మ. ఉద్యోగాన్ని, నా భర్తను ఎన్నుకునే స్వేచ్ఛ నాకు ఇచ్చారు. ఆమె వేసిన బాటలోనే నేను నా కూతురిలో స్వేచ్ఛా భావాలను ప్రోత్సహిస్తున్నాను.

ఆనాడు వీరేశలింగంగారు లేకపోతే? ఉన్నా.. ఈ రకమైన సమాజ మార్పులకు ప్రయత్నించక పోతే? ఇప్పటి నా పరిస్థితి ఎలా ఉండేది? అనే ప్రశ్న నాలో మొదలైంది. అమ్మో! తలుచుకుంటేనే ఇప్పటికీ నాకు భయమే. వద్దు బాబు వద్దు.. అటువంటి బానిస బతుకు. స్త్రీ స్వేచ్ఛే ముద్దు... అనుకున్నాను.

కందుకూరి ఆశయాలు, కలలు కొంత మేరకు సాకారం అయ్యాయి గానీ, నిన్నటి పేపరు వార్త నన్ను ఇంకా కలచి వేస్తూనే ఉంది. దేముడితో పెండ్లి ఏమిటి? ఆ పిల్ల వయసు ఏమిటి? అసలు మనం ముందుకు వెళ్తున్నామా? వెనక్కు నడుస్తున్నామా? కందుకూరి దారి ఇంకా అనుసరణీయమే! ఇంకా చేయాల్సి చాలా ఉంది. ఆయన వేసిన బాటలో మనం ప్రయాణం కొనసాగించాలి. ఇంక ఆయన స్వప్నం మనదే. స్వప్న సాకారానికై మనం వడివడిగా ముందుకు సాగాలి.

వాన చినుకు అట్టా తడిపితే..!

అట్టమీది కథ

- అజయ్ కుమార్ వారాల
95023 95077

'వాన చినుకులు ఇట్టా తడిపితే ఎట్టాగ ఆగుతుంది వయసే.. నీటి చురకలు అట్టా తగిలితే ఎట్టాగ లొంగుతుంది సొగసే..'.. ఇలాంటి వానపాటలెన్నో మనకు. గాలి వానలో, వాన నీటిలో పడవ ప్రయాణాలు, వచ్చే వచ్చే నీలి మబ్బుల్తో తుళ్లింతలు, ఈ వర్షం సాక్షిగా ఆకాశ గంగ దూకుళ్లకి కారణం రుతుపవనాలే. అందుకే, మనకు రుతురాగాలూ ఉన్నాయి. మాన్‌సూన్ వెడ్డింగ్‌లున్నాయి. భారతీయ జీవనంలో నైరుతి వైపుగా వీచే గాలుల తాకిడి ఎక్కువ. పశ్చిమ, తూర్పు కనుమలు తెచ్చే జల్లుల అలికిడి ఎక్కువ. అందుకే ఈ దేశం సుభిక్షంగా, సొగసుగా ఇంకా యుక్త వయస్సులోనే ఉన్నట్టు కనిపిస్తుంది. అందుకే, అది వాన చినుకు తడిపితే ఆగలేదు. నీటి చురకలు తగిలితే లొంగలేకపోయేది. ఇదంతా, వర్షపు సిరులు కురిశాక కదా..! మరి, ఆ వాన చినుకు ఎట్టా తడుపుతోందో..! రుతుపవనాలు ఎట్టా కదులుతాయో..! తెలుసుకుందాం. వాన తడిలోని అసలు సడి విందాం.

ఒక్క మబ్బు లేదు, సన్నీగా ఉంది డూడ్స్... అని రోడ్డెక్కినోడి నడినెత్తిన కుండపోత కురిపించి పిడుగులతో జడిపించేస్తాయి రుతుపవనాలు. ఓహ్... అతడికి మాన్‌సూన్ బర్స్టింగ్ గురించి తెలియదనుకుంటానేమో..! సానుభూతొద్దు బ్రో..! అదిగో, రోడ్డు పక్కన మామిడి కాయలమ్మే ఆ పెద్దాయన్ని చూడండి. పాలిథీన్ కవర్‌నెలా రెడీగా పెట్టుకున్నాడో. మరి మన మాన్‌సూన్‌ది ఎంతటి చరిత్రనుకున్నారు. ఆ పెద్దాయన తాత, ఆయన తాత, ముత్తాత ఇంకా ఇంకా..! అలా చెప్పలేం కానీ, అతి పురాతన, అత్యంత ఎదురుచూసే రుతుపవనాలుగా వీటికో రికార్డు ఉంది. ఏంటీ... ఈ వ్యాసం చదువుతుండగానే, రేడియోలోనే మరేదో మెసేజ్‌లోనో.. 'రానున్న 24 గంటల్లో...' అనే సందేశం చల్లగాలిలా తగిలిందా..! ఇదే మాట, అదిగదిగో అక్కడ డాబా ఇంటి మీద పిండి ఆరబోస్తున్నావిడకు చెప్పి చూడండి. 'ఆ.. వానా గీనా... అదొచ్చినప్పుడు చూసుకుందాం లే' అనేసి పాత చీర మీద పిండిని సన్నగా చెరుపుతుంది చూడండి. అవును... 'వర్షం' సినిమాలో చూల్లేదూ.. ఓ పాత్ర అదేపనిగా వాతావరణ వివరాలు చెప్పడం.. అది తప్పవడం...! సరదాగా సరదాగా సీన్‌లు నవ్వులు కురిపించేస్తుంటాయి. చిత్రం వరకూ నవ్వుల్లో తడవడం సరే మిత్రమా..! మరి, ఎవరో ఫొటో తీసినట్టు.. గట్టు మీద నిల్చొని పదే పదే ఆకాశంకేసి, వానొస్తుందనే ఆశకేసి చూసే రైతన్న సంగతేంటి..! వాన రాకడేమో గానీ, ప్రాణం పోకడ అర్థమైపోతుంది. అందుకే, 2017లో ఓ కొత్త విధానాన్ని రుతుపవనాల కోసం రూపొందించింది వాతావరణ శాఖ. దాని పేరు 'మాన్‌సూన్ మిషన్'. అంతకుముందున్న మోడళ్లను దాటి భూమంతా మారుతున్న పరిణామాల్ని లెక్కల్లోకి తీసుకుని రుతుపవనాల తీరు మీద అధ్యయనం చేస్తుందీ ప్రాజెక్ట్. విదేశాల సహకారమూ ఉంది ఇందులో. దాదాపు 400 కోట్ల భారీ వ్యయముందిందులో. వందల శాస్త్రవేత్తల సమన్వయముందిందులో..! ఎక్కడో ఉత్తర అట్లాంటిక్, పసిఫిక్ మహా సముద్రాల ఉపరితల ఉష్ణోగ్రతలు, భూమధ్య రేఖ దగ్గరున్న హిందూ మహా సముద్ర ఉష్ణోగ్రతలు, ఉత్తరాసియా సముద్ర మట్ట పీడనం వాయువ్య యూరప్ భూభాగ ఉపరితల ఉష్ణోగ్రతలు, అరేబియా సముద్ర ఉపరితల పీడనం, పసిఫిక్ వేడినీటి పరిమాణం... ఇలా మొత్తం రౌండేసి నివేదికలు తయారుచేసుకుంటారీ మిషన్లో. అంటే.. మన నుదిటి చెమటను తుడిచే రుతుపవనాల చల్లదనానికి ఇంత విషయం, ఇన్ని ప్రభావాలున్నాయన్న మాట..! ఒక్కమాటలో చెప్పాలంటే, భౌగోళికంగా జరిగే ప్రతి పర్యావరణ పరిణామానికి రుతుపవనాలు ప్రభావితమవుతాయి. ఇన్ని లెక్కలేసుకునే ఈసారి వర్షాలు 'నియర్ నార్మల్' అని చెప్పిందిలానే..!

ఆర్థిక గాలులు, అన్న వర్షాలు

అయినా, వర్షాల మీద కుండెడు ఆశ పెట్టుకునే పరిస్థితి నుంచి మనం బయటపడలేదు. దేశ ఆర్థిక రంగాన్ని పరుగులు పెట్టిస్తారనే ఫైనాన్స్ మినిస్టర్లూ ఒప్పుకుందిదే..! మన దేశానికి, చుట్టూ కలుపుకుని చెప్పాలంటే, దక్షిణాసియా ఆర్థిక రంగాన్ని నడిపిస్తోంది.. మన కనుమలపై, కొండలపై నుంచి వడివడిగా కదిలే నైరుతి రుతుపవనాలు. అందుకే, దేశానికి నిజమైన ఆర్థిక మంత్రి రుతుపవనాలని ఓ ఆర్థిక మంత్రి బడ్జెట్ సమావేశాల సందర్భంలో ఒప్పేసుకున్నారు. దాదాపు 70 శాతం నీటి అవసరాలన్నీ రుతుపవనాల కాలంలో కురిసే వర్షాలతోనే తీరుతున్నాయి. దాదాపు దక్షిణాది నదులన్నింటినీ కన్నదీ, వాటి కడుపు నింపుతోందీ ఈ రుతుపవనాలే. దాదాపు 65 శాతం మంది వ్యవసాయ సంబంధిత ఆదాయంతోనే నెట్టుకొస్తున్నారు. వీరందరికీ అన్నం ముద్ద, గ్లాసు నీళ్ల దక్కించేవీ రుతుపవనాలే. ఖరీఫ్ సీజన్‌లో రైతు నవ్వాడంటే... రుతుపవనాలు అనుకూలించాయని చెప్పాలి. ఉరుకుల పరుగుల నగరం స్తంభించిందంటే రుతుపవనాలు ప్రతాపం చూపించాయని తెలుసుకోవాలి. కేరళ వరదలు, చెన్నై చిందరవందర, ముంబై ముంపు, కర్నూలు కకావికలం... వార్తా పత్రికల్లో తాటికాయంత అక్షరాల్లో శీర్షికలు వెలిశాయంటే... దానికి తగ్గ సైజులో వర్షపు చినుకు దాడిచేసినట్టే. గోదావరి జిల్లాల్లోని అవ్వల్ని, తాతల్ని అడిగితే... భారీవర్షాలు చేసే విలయాల కథలు కడవడు పోగేసుకు చెబుతారు. తాతలు చెప్పిన వానాకాలపు కబుర్లని, ఈదుళ్లని కావిడేసుకుని తిరిగే వారసత్వాలూ కనిపిస్తాయి. ఆర్థర్ కాటన్ విగ్రహాలు గ్రామగ్రామాన అక్కడ వెలిశాయంటే.. జల ప్రాజెక్టుల చలువేంటో గుండెల్లోకి ఇంకుతుంది. ఇరిగేషన్ ప్రాజెక్టుల విలువ బుర్రల్లోకి దిగుతుంది. టౌన్ ప్లానింగ్ దగ్గర నుంచి రీ-ఫారెస్టేషన్ వరకు ప్రతి లింకూ సాలీడు గూటి మీది నీటి బిందువుల్లా ఒకదానికొకటి అల్లుకుని కనిపిస్తుంది. ఈ దేశంలో ఏం చేయాలన్నా రుతుపవనాల్ని దృష్టిలో పెట్టుకుని చేయాలనే.. ఎరుక మెరుపులా సర్రున పాకుతుంది. పల్లె నుంచి పట్టణం వరకూ వాటి బతుకు దాహమంతా రుతుపవనాలే తీర్చాలి.

ఢిల్లీ ఇలాక్కూడా దేశకేంద్రమే..!

రుతుపవనాలంటే.. భయమక్కర్లేదు కానీ, సరిగ్గా సమాయత్తమై ప్రభుత్వం గౌరవిస్తే కరువులు, వరదల నుంచి కొంచెం కోలుకోవచ్చు. మన రాయలసీమ ప్రాంతంలో నీటి చుక్క నేల రాలదేమని ఆవేదనకు ఆన్సర్ రాజస్థాన్‌లో దొరుకుతుంది. రుతుపవనాల వచ్చెళ్లే దారిలోనే ఈ రెండూ ఉన్నా వర్షపాతలేమి సామాన్యుల్ని ఆశ్చర్యంలో పడేస్తుంది.. థార్ ఎడారి పుట్టుక, విస్తరణకు కారణం రుతుపవనాలకు అడ్డంపడే ఎత్తైన కొండలు, పర్వతాలు లేకపోవడమే..! అవి నిన్నందుకోనూ అంటూ ఆ ప్రాంతానికి ఎత్తున కదిలిపోతూ వెళ్లి ఉత్తరభారతాన్ని అడ్డంగా తడిపేస్తాయి. తిరుమల గిరుల్లో, మౌంట్ అబూ ప్రాంతంలో వాన వెల్లివిరిసి మిగతా ప్రాంతాన్ని అస్సలు పట్టించుకోకపోవడానికి అడ్డుపడేదేదీ లేదు.

రుతుపవనాలు అరేబియా సముద్రం మీదుగా కదిలేవి ముంబైను ముద్దముద్ద చేస్తే.. హిందూ మహా సముద్రం నుంచి దేశాన్ని అందుకునేవి కేరళ తీరాన్ని తాకి దక్షిణాదిని ముద్దుచేస్తాయి. ఈ రెండు భాగాలు వేటికవే కదిలి, హిమాలయాల అడ్డుని, గడ్డకట్టే చల్లదనాన్ని చూసి వెనక్కు మరలి ఢిల్లీ ప్రాంతంలో ఒక్కటై కదిలిపోతాయి. అస్సలు కోట్ల ఏళ్ల క్రితం హిమాలయాలు గానీ, టిబెట్ పీఠభూమి కానీ ఏర్పడకపోయి ఉంటే, ఇవన్నీ అలా అలా పైపైకి పోయి తిరిగివచ్చేవి కావు. కానీ, ఈశాన్య రుతుపవనాల్లా తిరిగి మనల్ని జనవరిలో పలకరిస్తున్నాయి. వీటి ప్రభావం తక్కువే కానీ, ఈ చక్కర్లు కొట్టడం వల్లే దేశం పచ్చగా ఉంటోంది. మన పశ్చిమ కనుమలు, మేఘాలయ ఇంకా ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో అత్యధిక వర్షపాతం నమోదవడానికి కారణాలవే. చిరపుంజి, మాసిన్‌రామ్ అట్టే పది కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాలు వర్షపాత రికార్డుల్లో కుస్తీలు పడేది అందుకే..!

మెకునా అటులాగితే.. వాయు ఇటు తిప్పాడు..!

అరేబియా, బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనాల వల్ల రుతుపవనాలు వర్షం కురిపించేదీ లేనిది తెలుస్తుంది. గతేడాది, మెకునా అనే వాయుగుండం న్యాయంగా కురవాల్సిన పశ్చిమ భారత్ వర్షాన్ని ఎత్తుకుపోయి సోమాలి, ఒమన్ హద్దుల్లో పడేసింది. అందుకే, ముంబైని తాకాల్సిన

'నైరుతి' కాలం

జూన్-సెప్టెంబర్ మధ్య నాలుగు నెలలపాటు దేశంలో వర్షాకాలం ఉంటుంది. దాదాపు 87 శాతం వర్షపాతం ఈ కాలంలోనే చూస్తాం. దీనికి కారణం నైరుతి రుతుపవనాలే. దక్షిణాది నుంచి ఉత్తరాది, ఈశాన్య ప్రాంతాలకు దీని దిశ సాగుతుంది. రుతుపవనాలు వడివడిగా సాగుతూ పోగేసుకొచ్చిన సముద్రపు నీటిని (ఆవిరిని) అక్కడక్కడా కురిపిస్తుంటుంది. ఓ వైపు ఎండ తాకిడి, మరో వైపు చిరుగాలులు, చిరుజల్లుల ఉపశమనం.. ఈ కాలం తీరంతా విచిత్రం..! అకస్మాతుగా వర్షం కురవడం దీని మరో విచిత్రం. ఒక్కసారిగా 3-6 డిగ్రీ సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతని తగ్గించేస్తాయి నైరుతి రుతుపవనాలు. అందుకే, అలా వర్షం విడిచి గంట కాకుండానే మబ్బులు కరిగి ఎండ పెరిగి వేడిమి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. కానీ, రుతుపవనాలకు స్వాగతం పలికే పశ్చిమ కనుమలు చల్లగా ఈ కాలమంతా స్థిరపడతాయి.





రుతుపవనాలు నిరుడు ఆలస్యమయ్యాయి. ఈ ఏడాది 'వాయు' భారీ వర్షాలని భారీగానే భయపెట్టి గుజరాత్‌ని వణికించింది. కానీ, చివరకు సద్దుమణిగి మంచి వర్షాల సూచనలిచ్చింది. ఉపద్రవం నుంచి బయటపడ్డామనే ఆనందమెక్కువైందేమో ఆ పరిణామానికి 'కంపాషనేట్ మాన్‌సూన్' అని రుతుపవనాల్ని హత్తుకున్నాం. మనదేశంలోకి రుతుపవనాలనగానే కేరళ తీరం వైపు చూస్తాం. ఈ వ్యాసానికి అనుబంధంగా పెట్టిన కొన్ని చిత్రాలు కూడా దానివే. కానీ, న్యాయంగా మాట్లాడుకోవాలంటే, అండమాన్ నికోబార్ దీవులతో మన రుతురాగాల్ని ఆలపించాలి. అవెప్పుడో మేలోనే దేశానికి అక్కడే హాయ్ చెప్పేస్తాయి.

ఆ గాలి చెల్లాచెదురైతే..!

ధృవాల దగ్గర నుంచి భూమధ్య రేఖ వరకు చాలా అంశాలు రుతుపవనాల్ని శాసిస్తున్నాయి. సముద్ర ఉష్ణోగ్రతలు పెరిగి భూభాగ ఉపరితలమూ ఎక్కువ వేడిమి ఉంటే వర్షాలు కురవడం కష్టం. గాలి మోసుకొచ్చే నీటి ఆవిరి చల్లబడి ఇక్కడ నేల దిగాలి. కానీ, గ్లోబల్ వార్మింగ్ మన రుతుపవనాల్ని చెల్లాచెదురుచేస్తోంది. ధృవాల నుంచి చల్లటి నీటి ప్రవాహం, భూమధ్య నుంచి వేడి నీటి ప్రవాహం మహాసముద్రాల్లో తిరుగుతుంటాయి. వీటిలో కొంచెం తేడా వచ్చినా సమస్యే. ఎక్కడో ఆస్ట్రేలియాలోని డార్విన్, ఫ్రెంచి పాలినేషియాలోని తహితీ వాతావరణ పీడనాలు భారత్ ప్రెసిపిటేషన్‌ను నిర్ణయిస్తాయి. మడగాస్కర్ తూర్పు భాగంలోని గాలి ఒత్తిడి, వెస్టర్లీ, ఈస్టర్లీ జెట్‌స్ట్రీముల సముద్ర సంగమస్థలి, సౌతీస్ట్ ట్రేడ్ విండ్స్.. ఇలా చాలా పారామీటర్లని తీసుకుని వర్షపాతాన్ని అంచనా వేస్తారు. కానీ, మనిషి వైపరీత్యాల వల్ల ఈ వ్యవస్థంతా అస్తవ్యస్తంగా మారిపోయింది. ఎన్ని పర్యావరణ అవగాహన తరగతుల్లో తడిపినా మారకపోతే.. వాన రాక మీద ఆశలు ఆవిరైపోతాయి. హిమాలయన్ గ్రేట్ బ్యారియర్ రుతుపవనాల్ని శాంతింపజేయలేదు. ఇప్పటికే, అటుగా చైనా వైపుగా హిమానీ నదాలు కరిగిపోటెత్తుతున్నాయి. ఉత్తరాఖండ్ జలవిలయాలూ ఇటూ చూస్తున్నాం. హిమాలయాల చల్లదనం అందకపోతే, రుతుపవనం రగిలి బొట్టు కూడా విదల్చకుండా తప్పుకుపోతుంది. సముద్రంలో అలజడి తగ్గకపోతే.. అల్పపీడనాలు నీటిచుక్కను పక్కకుమళ్లిస్తాయి. 1950ల నుంచి మనదేశంలో వర్షపాతంలో భారీ మార్పులు వచ్చాయి. వరదలు, కరువులు వంటి ప్రకృతి వైపరీత్యాలు పెద్ద ఎత్తున నష్టం కలిగించడం పెరిగింది. దాదాపు 10 శాతం వర్షపాతం మధ్య భారతంలో తగ్గిపోయింది. 2002-2014 మధ్య కొంత కోలుకున్నట్టు కనిపించినా వరస వైపరీత్యాలు మనల్ని ముంచెత్తుతున్నాయి.

భూమ్మీదే అత్యంత ఉత్పాదకత కలిగించేవాటిగా ఈ రుతుపవనాలకు పేరు. ఎక్కడెక్కడి నుంచో వేల ఏళ్ల నుంచి మానవ వలసలు వెతుక్కుంటూ వచ్చిందిందుకే..! ఎక్కడలేని వృక్ష వైవిధ్యం, జంతు సిరి.. జీవ గోళం ఇక్కడ మనగలుగుతోందంటే ఈ రుతుపవనాల ప్రభావమే. విశేషమైన వర్షారణ్య ప్రాంతాల్ని,

నిర్వీర్యపరిచే ఎడారిసీమనూ అందించిందీ వాటి గమనమూ, గమ్యమే..! 'మాన్‌సూన్ మిషన్ల'కు ఎంత ఖర్చుచేసినా తప్పులేదు. కానీ, ఇదంతా వర్షం పడుతుందా, లేదా, ఎంత పడొచ్చనే లెక్కలకే కానీ, రుతుపవనాల ఆరోగ్యం విషయమేం ఏంచేద్దాం..? భూమ్మీద ఎక్కడెక్కడో, ఎన్నెన్నో అంశాలున్నాయిగా..! ఇక్కడ మనం పర్యావరణాన్ని జాగ్రత్తగా చూసుకుంటే.. రుతుపవనాల చెమ్మని జాగ్రత్త చేసుకుంటే సరిపోతుందా..! అంటే, సమాధానం ఒక్కటే.., మనింటి సమస్యకు ముందుగా మనం కదలకపోతే ఇంకెవ్వరు పట్టించుకుంటారు. మన దేశానికి ప్రాణజలాన్నందించే రుతుపవనాల విషయంలో మనం ముందడుగేయకపోతే ఎలా..? అదిగదిగో చూడండి... ఆ నాలుగేళ్ల చిన్నారిని వాన చినుకు ఎట్టా తడుపుతుందో..! ఎట్టా కేరింతలు కొట్టిస్తుందో..! నీటి ధారను ఒడిసిపట్టాలని ఆడుతోన్న ఆ చిట్టిచేతులకు భవిత తడిని, చినుకు పూలు ముద్దాడుతోన్న ఆ నీరారు బుగ్గలపై నవ్వుని చెదరనీయొద్దు కదా..!

★

రుతురాగాల సవ్వడులు...

★ అరేబియా సముద్రం నుంచి వచ్చే రుతుపవనాల కంటే బంగాళాఖాతం నుంచి వీచేవి త్వరగా దేశాన్ని చేరతాయి.

★ సాధారణంగా బంగాళాఖాతం శాఖ కోల్‌కతాను జూన్ 7న తాకి అస్సాం వైపు విస్తరిస్తుంది. అరేబియా సముద్రం శాఖ ముంబైని జూన్ 10న తాకి ఉత్తరాదికి కదిలెళుతుంది. జూన్ మొదటి వారంలో కేరళను తాకిన గాలులు తెలుగు రాష్ట్రాల మీదుగా మధ్య భారత్‌కు విస్తరించి మరలుతాయి. జులైకి కాశ్మీర్‌ని తడిపి దేశమంతా పరచుకుంటాయి.

★ అరేబియా సముద్రం నుంచి వచ్చే మొత్తం రుతుపవనాలు దేశంలోకి చేరితే, బంగాళాఖాతానివి మాత్రం ఎక్కువ భాగం మయన్మార్, థాయ్‌ల్యాండ్, బంగ్లాదేశ్, మలేసియాకు పోతాయి.

★ తొలి రుతుపవన ప్రవాహం తాకీతాకగానే 250 సెం.మీ.ల వర్షపాతాన్ని కలుగజేస్తుంది. పశ్చిమ కనుమల్ని లంబకోణంలో తాకడమే దీనికి కారణం.

★ రెండో ప్రవాహం నర్మదా-తాపీ లోయల గుండా వీచి మధ్య భారతానికి విస్తరిస్తుంది. ఇక్కడ తీరంలో వర్షపాతం తక్కువ. రుతుపవనాల్ని అడ్డుకునేవేవీ లేకపోవడమే కారణం.

★ మరో ప్రవాహం ఆరావళి పర్వత శ్రేణికి సమాంతరంగా సాగుతుంది. అంతెత్తు పర్వతాల పక్కనే ఉన్నా వాటికి తగలకుండా రుతుపవనాల దిశ ఉండటం వల్ల థార్ ఎడారి తయారైంది.

★ మొదటి ప్రవాహం గంగా-బ్రహ్మపుత్ర డెల్టా మీదుగా మేఘాలయ చేరి ఖాసీ కొండల్ని ముంచెత్తుతుంది. ఇక్కడే మాసిన్‌రామ్, చిర్రపుంజి ఉన్నాయి.

★ బంగాళాఖాతం నుంచి వచ్చే ప్రవాహం హిమాలయ వరకు వెళ్లి పశ్చిమ దిశగా మరలుతుంది.

★ మే 29- జూన్ 7 మధ్య సాధారణంగా రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయి.

★ 1918, 1955లో మే 11న (చాలా ముందుగా), 1972 జూన్ 18న (చాలా ఆలస్యంగా) రుతుపవనాల రాకడ నమోదైంది.

★ రుతుపవనాల వర్షపాతానికి పశ్చిమ, తూర్పు కనుమలు, హిమాలయాలు, పీఠభూమి ప్రాంతాలు వంటి ప్రత్యేక దేశ నైసర్గికతే కారణం. రుతుపవనాల కారణంగా అటు ఎడారి, ఇటు విశేషమైన వర్షారణ్యాలూ ఉపఖండంలో భాగమయ్యాయి.



'సోషల్' స్మార్ట్

స్మార్ట్‌గా చక్కబెట్టుకోండి...

ప్రస్తుతం ఉన్న ఆధునికకాలంలో కరెంటు బిల్లు కట్టడానికో, ఇంటి పన్ను, ఫోన్ బిల్లు చెల్లింపుల కోసం.. సంబంధిత కార్యాలయానికి వెళ్లి గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన అవసరం లేదు. మన చేతిలోనే ఉన్న స్మార్ట్‌ఫోన్‌లో ఆన్‌లైన్ ద్వారా ఎన్నో పనులను సులువుగా చేసేసుకోవచ్చు. ఒకప్పుడు ఎటువంటి ఆర్థిక లావాదేవీలు జరపాలన్నా బ్యాంకు లేదా పోస్టాఫీసుకే వెళ్లాల్సిన పరిస్థితి. మరి ఇప్పుడో ఈ పే, ఫోన్ పే, పేటియం వంటివి ఎన్నో యాప్‌లు రావడం వల్ల ఆ అవసరం కూడా లేకుండా పోయిందనే చెప్పాలి. ఇంటి పనులు చక్కబెట్టుకోవడానికే కాకుండా అత్యవసర సమయాల్లో ప్రాణ రక్షణ కోసమూ... శర వేగంగా సమాచారాన్ని అందించడంలో, కొత్త ప్రదేశాల్లో నిర్దేశిత డెస్టినేషన్‌కు చేరడానికో... ఇతర దేశాల్లో ఉండేవారితో ఒకరినొకరు చూసుకుంటూ మాట్లాడటానికో... ఉపయోగపడేవి ఈ యాప్‌లే..!

ఈ రోజుల్లో స్మార్ట్‌ఫోన్ లేనివారంటూ ఎవరూ లేరు. ఎప్పుడూ మన అరచేతుల్లోనే ఉండే ప్రపంచంలో ఎటువంటి యాప్స్ ఉండాలనేది తెల్చుకోవడం కాస్త కష్టతరమే. ఎందుకంటే అన్ని రకాల యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. అవన్నీ మనకు అవసరమా! అంటే అక్కరలేదనే చెప్పాలి. మరి ఎటువంటి యాప్స్ అవసరం? పని చేస్తున్న రంగానికి తగ్గట్టుగా, మన అభిరుచికి తగిన విధంగా, అవసరాలు అత్యావసరాలు, ఎదురయ్యే సమస్యలకు అనుగుణంగా, కొన్ని ప్రత్యేక యాప్‌లను కచ్చితంగా డౌన్‌లోడ్ చేసుకుని తద్వారా రోజువారీ పనిని చక్కబెట్టుకోవాలి. నిత్య జీవితంలో ఎంతో అవసరమైన కొన్ని యాప్‌ల గురించి సోషల్ స్మార్ట్‌లో మనం తెలుసుకుందాం..!

మనీ మేనేజ్‌మెంట్...

ఆర్థిక లావాదేవీలను జరిపేందుకు ఎన్నో రకాల యాప్‌లున్నా వాటికి ప్రొటెక్షన్ వాల్ ఉందా లేదా అనేది మనకే కాదు కనీసం బ్యాంకు వారికి కూడా తెలియని పరిస్థితి. మరి అటువంటప్పుడు నెల ప్రారంభం కాగానే అనేక రకాల చెల్లింపులు ఏ యాప్ నుంచి చేయాలి? అనేది ప్రశ్న. అందుకు సురక్షితమైన యాప్‌ను వాడాల్సిన అవసరం ఎంతో ఉంది. ఆర్థిక లావాదేవీల చుట్టూ ఆర్థిక నేరగాళ్లు సైబర్ క్రైమ్ హ్యాకర్స్ కాచుకుని కూర్చుంటారు.



అటువంటి వారికి అవకాశం ఇవ్వకుండా ఉండాలంటే... Walnut వంటి యాప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇదొక మనీ మేనేజ్‌మెంట్ యాప్. సాధారణంగా ఆర్థిక లావాదేవీల యాప్ అనేది ఏ ఫోన్ నెంబరు నుంచి చేస్తామో దానికే ఓటిపి, ఎస్ఎంఎస్ ఎలర్ట్స్ వంటివి వస్తాయి. సిమ్ మార్చితే ఇక ఆ నెంబర్‌కే అన్నీ వెళ్తుంటాయి. కానీ, ఈ యాప్‌లో ఉండే ప్రత్యేకత ఏంటంటే మీరు ఇచ్చిన నంబరుతోపాటుగా మీ స్మార్ట్ ఫోన్ నుంచి, ఒకసారి ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే మరే ఇతర స్మార్ట్‌ఫోన్‌లోకి సిమ్‌ని మార్చినా లావాదేవీలు చేయలేం. యాప్‌ను ఈ విధంగా వారు డిజైన్ చేశారు.

అయితే ఒకవేళ ఫోన్ పోయినా, పాడైపోయినా, కొత్త ఫోన్ మార్చవలసి వచ్చినా అప్పుడెలా అని? అనుమానం వస్తుంది. అటువంటి సమస్యను అధిగమించేందుకు ఈ యాప్‌వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వెంటనే బ్యాంకు వారికి తెలియచేసి లావాదేవీలు ఆపడం. మరోక విషయమేమంటే.. ఫోన్ కొనుక్కున్నప్పుడే దానికి ఇన్సూరెన్సు చేయించుకోవాలి. అప్పుడు ఫోన్ పోయినా, పాడైనా మన మెయిల్ ద్వారా ఆ ఫోన్ కంపెనీతో సమస్య చెబితే... వారే సైబర్ క్రైమ్ ద్వారా పరిష్కరిస్తారు. ఈ యాప్ ద్వారా ఆర్థిక లావాదేవీలు చేయడం వల్ల మన డబ్బును హ్యాకర్స్ దోచుకోవడం అంత సులువేమీ కాదు.

టైమ్ మేనేజ్‌మెంట్...

నిత్యం ఉరుకుల పరుగుల జీవనంలో చేయాలనుకున్న పనులు కొన్ని తీరికలేక మరికొన్ని గుర్తులేక వాయిదా వేస్తుంటాం. అటువంటి వారి కోసం ఎంతగానో ఉపయోగపడుతుందీ Any.do యాప్. అయినవారి పుట్టిన రోజులు, పెళ్లి రోజులు, కొన్ని ప్రత్యేకమైన వేడుకలకు, కార్యక్రమాలకు ముందుగానే నిర్వహించుకోవాల్సిన పనులు కొన్ని ఉంటాయి. అటువంటి సందర్భాల్లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తేది, కార్యక్రమం వంటివి ఫీడ్ చేసుకోవడంతో పాటు ఆ పనికి సంబంధించిన వాయిస్ ఎంట్రీ వంటివి చేసుకోవచ్చు. అంతేకాదు, రోజువారీ పనుల్లోనూ ఉపయోగకరంగా ఉంటుంది. ఉదాహరణకు ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు అమ్మ కోసమో, నాన్న కోసమో మందులు వంటివి తేవాలనుకుంటే... అమ్మ మాటల్లో వాయిస్ ఎంట్రీ చేసుకుని సమయాన్ని సెట్ చేసుకుంటే సరే..! పెట్టుకున్న సమయానికి అమ్మ మాటల్లోనే మీకు గుర్తుచేస్తుంది. ఇంట్లోవారికి మర్చిపోయాను అనే సమాధానం చెప్పనవసరం లేదు. అంతేకాదండీ...!



ఇటువంటి యాప్‌ల ద్వారా టైమ్ మేనేజ్‌మెంట్ కూడా అలవర్చుకోవచ్చు. ఫీల్డ్ వర్కులో ఎక్కువగా ఉండేవారికి, టైమ్ షెడ్యూల్ పెట్టుకుని చదువుకునేవారికి, ముఖ్యంగా అనారోగ్యం ఉండి సమయానికి మందులు వేసుకోవాల్సిన వారికి, ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఎక్కడ నుంచైనా...

సాధారణంగా కంప్యూటర్ నుంచి స్మార్ట్‌ఫోన్‌కి ఎటువంటి డేటాను పంపాలంటే ఇమేజ్, పిడిఎఫ్ రూపాల్లో మెయిల్, వాట్సాప్ వంటివాటికి పంపించి డౌన్‌లోడ్ చేసుకుంటాం. కానీ, Airdrod యాప్‌లో అలాకదు సరాసరి ఓపెన్ ఫైల్‌నే ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. ఒక్కోసారి ఆఫీసు పనిని ఫీల్డ్ వర్కులోనూ చేయాల్సివచ్చినా, లేక ఇంట్లోనే ఉంటూ పని చేయాల్సి వచ్చినా, అనుకోని దూర ప్రయాణాలు చేయాల్సి వచ్చినా ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంటుంది. అంతేకాదు,



నెట్ ఆఫ్‌లో ఉన్నా డేటా ట్రాన్స్‌ఫర్ అవగానే మీ ఫోన్‌కి నోటిఫికేషన్ వస్తుంది. నెట్ ఆన్ చేయగానే ఆటోమేటిక్‌గా ఆ డేటా ఫైల్‌తో సహా స్క్రీన్‌పైకి వచ్చేస్తుంది. అందుకు ఫోన్‌లో ఎక్కువ మెమోరీ ఉంటే సరిపోతుంది. ఎక్కడ నుంచైనా ఆఫీసు పనిని చేసుకోవచ్చు. ఈ యాప్ ఉద్యోగస్తులకే కాదండీ ప్రాజెక్టులు సబ్‌మిట్ చేయాలనుకునే విద్యార్థులకూ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.

భాషే ప్రధానం...

సమాచారాన్ని తెలుసుకోవాలంటే భాష ఎంతో అవసరం. Duolingo యాప్ ముఖ్యంగా భాషను నేర్చుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆఫీసు పనిమీద కొత్త ప్రాంతాలకు వెళ్లాల్సివచ్చినప్పుడు ఈ యాప్ ఉపయోగకరంగా ఉంటుంది. కొత్త ప్రాజెక్టులు చేపట్టినప్పుడు మనకు కావాల్సిన సమాచారాన్ని ఎక్కువ శాతం ఇంటర్‌నెట్ నుంచే సేకరిస్తాం. అలా సేకరించే క్రమంలో కొంత సమాచారం అనేక భాషల్లో ఉంటుంది. ఆ సందర్భాల్లో ఈ యాప్ ఎంతగానో అక్కరకు వస్తుంది. ఇతర భాషలు నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్నవారు ఈ యాప్ ద్వారా భాషను నేర్చుకోవచ్చు.



పదాలకు అర్థం చెబుతూ...

నిత్యం అభివృద్ధి చెందాలనే తపనతో ఉండే వారికి U-Dictionary యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మన చుట్టూ ఉండే అనేక కొత్త విషయాలు తెలుసుకునే క్రమంలో కొత్త పదాలు రాగానే వాటికి అర్థం తెలుసుకోవాలంటే డిక్షనరీ ఉండాల్సిందే. అదే ఆన్‌లైన్ డిక్షనరీ అయితే మరీ మంచిది. ఈ యాప్‌లో ఉండే ప్రత్యేకత ఏంటంటే ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ అనేక విషయాలను అర్థాలు, వాటిని ఎక్కడ ఎలా వాడాలో తెలియపర్చుతూ అనేక ఉదాహరణలు మనకు అందిస్తుంటుంది. ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసిన విషయాలను సైతం నోటిఫికేషన్ ద్వారా తెలియజేస్తుంటుంది. ఈ యాప్‌ని ఆఫ్‌లైన్ మోడ్ ఆన్‌లైన్ మోడ్‌లోనూ వాడుకునే సౌలభ్యం ఉంది.

అభిరుచికి తగ్గట్టుగా ...

అనేక మంది చిన్నతనంలోనే అభిరుచికి తగ్గట్టుగా నేర్చుకోవడానికి అవకాశం రాకపోయి ఉండవచ్చు. అటువంటి వారు తమ అభిరుచికి తగిన విధంగా ముందుకు సాగాలనుకుంటే... అందులో సంగీతం, డ్యాన్స్, ఆర్ట్స్, క్రాఫ్ట్ వంటి కళలు ఎన్నో ఉన్నాయి. ఆసక్తిని పెంపొందించుకోవాలన్నా, ప్రాథమిక అవగాహన పెంచుకోవాలన్నా, మెళకువలు తెలుసుకోవాలన్నా ఎవరి వద్దకూ వెళ్లక్కరలేదు. iPastels, ArtRage, ElfYourself, Just Dance Now, SingTrue, Easy Music, CraftGawker, Craftsy Tutorials వంటి యాప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి. నేర్చుకోవాలనే తపన ఉంటే చాలు ప్రస్తుతం ఆధునికయుగంలో సాధించి చూపవచ్చు. 21 సంవత్సరాల వయసులో కార్ యాక్సిడెంట్‌లో తన రెండు కాళ్లనూ పోగొట్టుకున్న యువతి మునిబాయి మజారి (32). నేడు తాను ఓ గొప్ప రచయిత, ఆర్టిస్టు, సింగర్, యాక్టివిస్టు, మోటివేషనల్ స్పీకర్ అయిందంటే అందుకు కారణం ఆమెలోని ఆసక్తి, తనకు అందుబాటులో ఉన్న ఆధునికతనూ సరైన పద్ధతుల్లో వినియోగించుకోవడమే. మునిబాయి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తాను ప్రస్తుతం ఈ స్థానంలో ఉన్నానంటే అందుకు కారణం ఆమె చేతిలో ఉన్న ఫోన్ ద్వారా ప్రపంచాన్ని చదవడానికి అవకాశం రావడమే అని చెప్పుకొచ్చారు.



తక్షణమే స్పందిస్తూ...

ఇంట్లో చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకూ ఆరోగ్య సమస్యలు ఎదురవుతూనే ఉంటాయి. అత్యవసర పరిస్థితులు ఒక్కోసారి ఎదురవుతుంటాయి. అటువంటప్పుడు HealthifyMe యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంటుంది. స్మార్ట్‌ఫోన్‌లో ఈ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. ఇంట్లో ఎందరు ఉంటారు? వారి వయసు, వారి సమస్యలు, వారు రెగ్యులర్‌గా చూపించుకుంటున్న హాస్పిటల్ వంటి వివరాలు అందులో అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు దగ్గర నుంచి, చిన్నా, పెద్దా సమస్యల వరకూ వీడియోల రూపంలో మనకు అందుబాటులో ఉంటాయి. మరీ తీవ్రమైన సమస్యలైతే వారే మనకు ఎన్నో ప్రత్యామ్నాయ విధానాలను చూపుతారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా తక్షణమే స్పందిస్తూ రక్షణగా నిలుస్తుందీ యాప్.

ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్, ఎంటర్‌టైన్‌మెంట్, ట్రావెల్ సదుపాయాలకు ఎన్నో యాప్‌లు మీ సౌలభ్యం కోసం స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని వాడుతుంటారు. ఎటువంటి టెక్నాలజీనైనా మన సమయాన్ని ఆదా చేసుకోవడానికీ, మనం అభివృద్ధి కావడానికీ ఉపయోగించుకోవాలే తప్ప అదే వ్యసనంగా మారకూడదు. స్మార్ట్‌ఫోన్ లేకపోతే, నెట్ లేకపోతే జీవితంలో అన్నీ కోల్పోతున్నట్లు ఉండకూడదు. అలా ఉంటున్నట్లయితే మీరు ప్రమాదంలో ఉన్నట్లుగానే భావించండి. అధిగమించేందుకు మీరే ప్రయత్నం చేయండి.

- వర్ధని

శాంతి నగరం...

యమహా నగరీ

ఏళ్ల తరబడి యుద్ధం చేసినా అలుపెరగని సైన్యంతో అగ్రరాజ్యాన్ని సైతం తిప్పికొట్టిన చరిత్ర వియత్నాంది. ఆ దేశ రాజధాని శాంతి నగరంగా పేరుగాంచింది. చేతివృత్తులను, వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, ప్రపంచంలో అతివేగంగా అభివృద్ధి చెందుతోన్న నగరాల్లో ఇది ఒకటి.

❑ హనోయి భౌగోళిక విస్తీర్ణం 3,328 చదరపు కిలోమీటర్లు. జనాభా 77,81,631 మంది. జనసాంద్రత ఒక కిలోమీటరుకు 662 మంది.

❑ హనోయి నగరం ఎర్రనదీ డెల్టాలో విస్తరించి ఉంది. 1873లో ఈ నగరాన్ని ఫ్రెంచి వారు ఆ తర్వాత 1940–45 వరకు జపనీయులు స్వాధీనపరుచుకున్నారు. 1945 సెప్టెంబరు 2న కమ్యూనిస్టు పార్టీ నేత హో చి మిన్ దీనిని రిపబ్లిక్‌గా ప్రకటించారు. ఆయన నేతృత్వంలోనే తొలి జాతీయ అసెంబ్లీ ఏర్పాటైంది. నేటికీ ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు పరిపాలన సాగుతోంది.

❑ ఒకప్పుడు దక్షిణ, ఉత్తర వియత్నాంలుగా విడిపోయిన ఈ దేశంలో రెండింటిని కలిపే యత్నంలో అంతర్యుద్ధం మొదలైంది. అయితే ఈ యుద్ధంలో అమెరికా దక్షిణ వియత్నాంకు ఆర్థికంగా, సైనిక పరంగా సహకరించినా ఉత్తర దేశ కమ్యూనిస్టుల ముందు నిలువలేకపోయింది. 2 జులై 1976న ఏకీకృత వియత్నాం ఏర్పడింది.

❑ హనోయిలో హోన్‌కీమ్ (కత్తి సరస్సు), పశ్చిమ, ట్రుక్ బాచ్, బే మువ్, థీన్ క్వాంగ్ అనే ఐదు సరస్సులు ఉండటంతో సరస్సుల నగరంగా పేరుగాంచింది.

❑ హనోయిని 'పారిస్ ఆఫ్ ద ఈస్ట్' అంటారు. పారిస్‌లోని ఈఫిల్ టవర్, అమెరికా స్టాట్యూ ఆఫ్ లిబర్టీలను డిజైన్ చేసిన అలెగ్జాండర్ గుస్తావే ఈ నగరంలోని 'లాంగ్ బీన్ బ్రిడ్జ్'ను డిజైన్ చేశారు. దీని చుట్టూ పేద ప్రజలు నివసిస్తున్నారు.

❑ 1999 జులై 16న యునెస్కో ఈ నగరాన్ని 'శాంతి నగరం'గా పేర్కొంది. హనోయిలో చైనా, జపాన్, రష్యా సంస్కృతులు కనబడతాయి. ఈ ప్రాంతంలో చేతివృత్తుల వారిని అధికంగా ప్రోత్సహిస్తారు. రకరకాల కుండలు, టెక్స్‌టైల్స్, సిరామిక్ వస్తువులు, గిఫ్ట్ ఐటమ్స్, చిత్రాలు పర్యాటకులను ఆకర్షిస్తాయి.

❑ హనోయి నగరం వాణిజ్యంపై ఆధారపడి ఉంది. దాదాపు 161 దేశాలతో వర్తకం జరుపుతోంది. ప్రపంచదేశాలన్నింటి కంటే హనోయి జిడిపి అతివేగంగా వృద్ధి చెందుతోందని పిడబ్ల్యుసి పేర్కొంది. ఎగుమతులు, పర్యాటకం, బ్యాంకింగ్ రంగాలు ఈ నగర వృద్ధిలో ప్రధాన పాత్రలు పోషిస్తున్నాయి.

❑ ఆసియా పసిఫిక్ ఆర్థిక సహకార (ఎపిఇసి) సమావేశాలు 2006, 17 ఏడాదుల్లో హనోయిలో నిర్వహించారు.

❑ ఈ ప్రాంతంలో పట్టణీకరణ ఒక సమస్యగా మారింది. దీంతో పేద, ధనికుల మధ్య అంతరం ఏర్పడుతోంది. ఇక్కడ గాలి, నీటి కాలుష్యం ఉంది.

❑ ఇక్కడ రూరల్ ప్రాంతాల్లో సరైన రోడ్ల సదుపాయం లేకపోవడంతో ప్రభుత్వం రోడ్లు, మంచినీరు, శానిటేషన్ వంటి కార్యక్రమాలపై దృష్టి సారించింది. అంతే కాకుండా విద్య, వైద్యం, సామాజిక మార్పులపై దృష్టి సారించింది.

❑ హనోయిలోని నివాసాలు ప్రత్యేకంగా కనబడతాయి. వీటిని 'ట్యూబ్ హౌసెస్' 'రాకెట్ హౌసెస్' అని అంటారు. ఇవి తక్కువ వెడల్పులో పక్కపక్కనే ఉంటాయి. 30 మీటర్ల వెడల్పు, 3 నుంచి 7 అంతస్తుల్లో ఉంటాయి. ప్రతి ఇంటిపైనా ఎర్రని పెంకులతో కప్పు ఉంటుంది. అయితే ఈ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం బట్టి ఆస్తి పన్నును వసూలు చేస్తారట.! దాంతో ఈ విధమైన నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు.

❑ వియత్నాం చరిత్రలోనే రాజకీయంగా కీలకపాత్ర పోషించిన కమ్యూనిస్టు నాయకుడు 'హో చి మిన్' 1969లో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మసోలియంలో భద్రపరిచారు. ఈ మసోలియాన్ని పర్యాటకుల సందర్శనార్థం ప్రతి రోజూ తెరిచే ఉంచుతారు.

❑ నీటిలో ప్రదర్శించే పప్పెట్ షో కోసం హనోయిలో ఒక థియేటర్ ఉంది. అదే 'థాంగ్ లాంగ్ వాటర్ పప్పెట్ థియేటర్'. ఒకప్పుడు ఈ ప్రదర్శనను వరి పొలాల్లో నిర్వహించేవారట. 11వ శతాబ్దంలో ఎర్ర నదీ ప్రాంతంలో వరి పొలాలు వరదకు గురైనప్పుడు ఒకరితో ఒకరు వినోదాన్ని అందించేందుకు ఈ పప్పెట్ షోను చేసేవారట.! ఈ బొమ్మల తయారీకి ప్రత్యేకమైన చెక్కను వాడతారు. ఈ షో ఆసియాలోనే ప్రత్యేకమైనది.

❑ హనోయి వీధి గోడలపై ఉన్న గ్రాఫిటీ వీక్షకుల చూపు తిప్పుకోనివ్వదు. ఈ చిత్రాలు వియత్నాం చరిత్ర, సంస్కృతికి, నివాళులు తెలుపుతాయి. చిత్రకారులు రంగురంగుల సిరామిక్ టైల్స్‌ను అందమైన చిత్రాలుగా మరల్చారు. అతిపొడవైన గ్రాఫిటీగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు కెక్కింది ఈ మొజాయిక్ కళ.

❑ హనోయిలోని టూరిస్టు ప్రదేశాల్లో ఆకర్షణీయమైనది 'టెంపుల్ ఆఫ్ లిటరేచర్'. దీనిలో ఐదు ప్రాంగణాలు ఉంటాయి. వియత్నాం సాంప్రదాయ ఆర్కిటెక్చర్ కనిపిస్తుంది. పచ్చని చెట్లు, ప్రశాంతమైన వాతావరణం ఉండటంతో పర్యాటకులను ఆకట్టుకుంటోంది.

ఒక పాటను కంపోజ్ చేయాలంటే ఫ్లూట్, తబలా, గిటార్, పియానో, వయొలిన్, వీణ, హార్మోనీ, డ్రమ్స్ ఇలా అన్ని వాయిద్యాలు కలిస్తేనే కొత్తరకపు స్వరాలు పుడతాయి. దీనిలో ఏ వాయిద్యానికి అదే ప్రత్యేకత సంతరించుకుంటుంది. ప్రతి వాయిద్యకారుడికి ప్రత్యేకత ఉంటుంది. ఎవరి టాలెంట్ వారిది. అయితే, పూర్తిగా ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్‌కీ ఇప్పుడు విపరీతమైన ఆదరణ దక్కుతోంది. సింగిల్ వాయిద్యంతోనూ కొందరు యువత క్రేజ్ దక్కించుకుంటున్నారు.

హార్మోనీయంపై ఇంగ్లిష్ పాప్..!

హార్మోనీయంపై 'బిలీవర్' పాప్ సాంగ్‌ను పలికించాడు ముంబై యువకుడు తుషార్ లాల్..! యూట్యూబ్‌లో 76 లక్షల వ్యూస్ దీనికి దక్కాయంటే ఎంత పాపులర్ అయ్యిందో కదా..! తుషార్ హార్మోనీయమే కాదు పియానో కూడా ప్లే చేయగలడు. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. హాలీవుడ్ సంగీత దిగ్గజం హాన్స్‌జిమ్మర్ సంగీతం స్వరపరచిన 'పైరేట్స్ ఆఫ్ కరేబియన్', 'హ్యారీపోటర్' థీమ్స్ తీసుకుని కవర్స్ చేశాడు. ఇండియన్ జామ్ ప్రాజెక్టును ఏర్పాటు చేశాడు. ('జామ్' అంటే జపాన్ యానిమేషన్ సాంగ్ మేకర్స్ అని అర్థం) తొలిసారిగా 'జామ్ ప్రాజెక్టు'ను జపనీస్ అనిసన్, బ్యాండ్ 2000 జూలై 19న స్థాపించారు. 1970 కాలం నాటి థీమ్ సాంగ్ ఆర్టిస్ట్ ఇచిరా మిజుకి దీనిని మొదలుపెట్టాడు. అంటే వాయిద్యాలతో పాటలు పలికించడం దీని ప్రత్యేకత. ఈ ప్రాజెక్టులో ఎవరికి వారికే ప్రత్యేకత ఉంటుంది. తుషార్‌లాల్ న్యూయార్క్‌లో డబ్‌స్పాట్ అనే మ్యూజిక్ కోర్సును పూర్తి చేసి 2014లో ముంబైకి వచ్చాడు. స్థానిక వాయిద్యాలతో సొంతగా మ్యూజిక్‌ను చేయడం, శాస్త్రీయ సంగీతాన్ని సమకాలీన ట్యూన్స్‌లోకి మార్చడం మొదలు పెట్టాడు. తబలా, ఫ్లూట్ వాయించే స్నేహితులతో కలిసి సింగిల్ టేక్‌లో తొలిసారిగా చేసిన 'గేమ్ ఆఫ్ థ్రోన్స్' కవర్ ఒక్క రోజులోనే యుట్యూబ్‌లో గొప్ప హిట్ కొట్టింది. మరో 13 వీడియోలను యుట్యూబ్‌లో రిలీజ్ చేశాడు. కాలేజీల్లో ప్రదర్శనలు ఇస్తున్నాడు. ఇమ్మీ అవార్డు గ్రహీత మై
ప్రైజ్ సైతం తుషార్‌ను అభినందించారు.

సందర్భం

వీణపై బ్రీత్‌లెస్

శంకర్ మహదేవన్ 'బ్రీత్‌లెస్' పాట పాడి ఒక
చరిత్రను సృష్టించారు. సంగీత విమర్శకుల్ని సైతం
మైమరపించారు. అటువంటి పాటను తన వీణపై
మనోహరంగా వాయించారు రాజమండ్రి నందుం
చెందిన శ్రీవాణి. ఆమె చేతులు వీణపై మనోహర
స్వరాలను పలికిస్తాయి. సోషల్ మీడియాను వేదిక
చేసుకుని ఆమె ప్రఖ్యాతి తెచ్చుకున్నారు.
'వెన్నెలవే...వెన్నెలవే'..అనే పాటతో తెలుగు, తమి
అభిమానులకు దగ్గరయ్యారు. శ్రీవాణి చేసిన ప్రేమ
పాట మలయాళంలో వైరల్ అయ్యింది. శ్రీవాణి వీ
రాగాల వీడియోను మహదేవన్ సైతం తన ట్విట్ట
షేర్ చేశారు. సమకాలీన రాగాలు నేటి యువత ఇ
కొత్తకొత్త పాటలను వీణపై పలికిస్తూ తన కంటూ
గుర్తింపు తెచ్చుకున్నారు. ఫోక్, లైట్ మ్యూజిక్, పా
సంగీతాలను సైతం వీణపై పలికింపగలరు. ఏడవ
నుంచే వీణ నేర్చుకున్నారు. చిన్నప్పటి నుంచే స్టేజి
ప్రదర్శనలు ఇచ్చేవారు. వీణలో రికార్డులు సృష్టించ
గంటలు తరబడి దానిపై కష్టపడాల్సిన పనిలేకుం
కొత్తగా అతి చిన్న వీణ (21 ఇంచుల పొడవు, 6
వెడల్పు)ను వాయించి ప్రపంచ రికార్డు సాధించార
శ్రీవాణి. కర్ణాటక విద్వాంసులు విక్కు వినాయక్ చే
మీదుగా 'వీణాలెజెండ్' పురస్కారాన్ని పొందారు
ఆమెకు సినీ అవకాశాలు చాలా వచ్చాయి. కానీ
ఎక్కువగా స్టేజి ప్రదర్శనలకే ప్రాధాన్యత ఇస్తున
'బండెనక బండి కట్టి...' అనే జానపద, అభ్యుద
పాటను ఆమె వీణతో పలికిస్తుంటే రోమాలు
నిక్కబొడుచుకుంటాయి.

సారంగిపై మేస్ట్రో..

గాయకులు తన స్వరంతో పాటను అద్భుతం
పాడగలరు. కానీ, అదే పాటను వాయిద్యాలపై
పలికించాలంటే ఎంతో ఏకాగ్రత, శ్రద్ధ అవసరం.
సారంగిపై మనోహరమైన పాటలను వినిపిస్తున్నా
మనోమణి. యూట్యూబ్‌లో సారంగి మనోమణిగా
గుర్తింపు తెచ్చుకున్నారు. చెన్నైకి చెందిన మణి.. గ
సబీర్ ఖాన్ వద్ద సారంగి నేర్చుకున్నారు. ఇళయర
సంగీతంలో వచ్చిన 'సాగరసంగమం'లోని
'మౌనమేలనోయి..' అనే పాటను సారంగిపై
మనోహరంగా పలికించి ఆయనకు అంకితం చేశ
యూట్యూబ్‌లో ఈ వీడియోను లక్షా ఏభై ఏడు వే
మంది వీక్షించారు. మేస్ట్రో హిట్‌లైన అంజలి, అజ
ఇదాయం, నాయగన్, దళపతి వంటి సినిమా పా
కవర్స్‌గా రూపొందించారు. ఈ వీడియోకి 80 వే
వచ్చాయి. సాగరసంగమం, అమృత సినిమా పాట
తన సారంగిపై ప్లే చేసి ఎం.ఎస్.విశ్వనాథన్‌కు అ
చేశారు మనోమణి.



వ్వా..!

పదనిసల్లో ప్రాణాలు పల్లవించే సాహిత్యం, సంగీతం ఓ వరం!! ఆ రెండూ పొదిగిన పాట ఓ అద్భుతం!! ఈ అద్భుతాన్ని మదిలో మెదిలించే వాయిద్యాల సవ్వడి ఎంతో మధురం. శాస్త్రీయ సంగీతంలో గాయకులే అందరి దృష్టిలో ఉంటారు. నిష్ణాతులైన వాయిద్యకారులు కొద్దిమంది మాత్రమే మనకి తెలుసు. కానీ, ఇప్పుడు దేశీ వాయిద్యకారుల ట్రెండ్ నడుస్తోంది. సామాన్యుల్లోని అసామాన్యులు వెలుగులోకి వస్తున్నారు.. పాశ్చాత్య సంగీతాన్ని స్థానిక వాయిద్యాలపై పలికిస్తున్నారు. ఒకప్పుడు శాస్త్రీయ గీతాలకు వీణ స్వరాలు కూర్చేవారు..కానీ, మన కళాకారులు పల్లె పాటలకు, సమకాలీన పాటలకు సైతం వీణను మీటుతున్నారు. ఫ్యూజన్‌లో ఒట్టి వాయిద్యాలతోనే వావ్ అనిపిస్తున్నారు. పాశ్చాత్య సంగీతాన్ని ఇక్కడి వాయిద్యాల ఫ్యూజన్‌గా వినిపిస్తున్నారు.

జూన్ 21 : మ్యూజిక్ డే

వయోలిన్‌పై ప్రేమ రాగం...

'96' చిత్రానికి సంగీతం అందించిన గోవింద్ వసంత పాటల్లోని 'కాదలే కాదలే' పాట గొప్ప హిట్ అయ్యి ఒక సెన్సేషన్ క్రియేట్ చేసింది. దాని నేపథ్య వాయులీనంలోకి మన మనసుల్ని లాక్కెళుతుంది. ఈ మధ్య వచ్చిన మేటి వయొలిన్ రాగాల్లో ఇది గొప్పదని చెప్పొచ్చు. అనేకమంది కాలర్ ట్యూన్లుగా మారిపోయిందిది. అదే పాటను ఫ్యూజన్ వయొలినిస్ట్ రూపా రేవతి కవర్ చేశారు. ఈ పాటకు కూడా అదే స్థాయిలో ఆదరణ లభించింది. యూట్యూబ్‌లో రూపా చేసిన వయొలిన్ పాటను దానికి 11 లక్షల వ్యూస్ దక్కాయంటే ఆమె పాటకు ఎంత రెస్పాన్స్ వచ్చిందో చెప్పొచ్చు. రూపా మ్యాజికల్ చేతి వేళ్ల గొప్ప సంగీతాన్ని అందించాయంటూ కామెంట్లు వచ్చాయి. రూపా యూట్యూబ్ చానల్ కూడా నడుపుతున్నారు. ఆమెకు లక్షా పదకొండు వేల మంది ఫాలోవర్స్ ఉన్నారు. వాయిద్యాల మెడ్‌లీ చేసి ఇళయరాజాకు అంకితం చేశారు. తన పాపతో కలిసి పాటలను చేయడానికి ఇష్టపడతారు రూపా.

ఫ్లూట్‌తో రహమాన్ స్వరాలు..

ఎఆర్ రహమాన్ సంగీత స్వరాలకు ప్రపంచం నలుమూలలా అభిమానులు ఉన్నారు. ఆయన పాటలు వింటూ మైరమరచిపోవచ్చు. అలాంటి మెలోడీ పాటలను ఫ్లూట్‌తో వినిపించాలంటే ఎంతో కష్టమైన పని. కానీ, విజయ్ కన్నన్ ఎంతో సులువుగా అంతే వినసొంపుగా మురళీ గానం చేశారు. 'నువ్వు..నేను..ప్రేమ...' చిత్రంలోని ప్రేమించే ప్రేమవా..అనే కన్నన్ వేణుగానాన్ని 17 లక్షల మంది వీక్షించారు. ఇంకా ఎన్నో పాటలకు తన ఫ్లూట్‌తో స్వరాన్ని వినిపించిన విజయ్ కన్నన్ తాను చేసిన పాటలను పోస్ట్ చేసేందుకు ఓ యూట్యూబ్ చానల్‌ను నడుపుతున్నారు. ఆయనకు 24,573 మంది ఫాలోవర్స్ ఉన్నారంటేనే అతన్ని ఎంతగా అభిమానిస్తున్నారో అర్థమౌతోంది.

కవర్స్ నుంచి సినిమాలకు..

ఎ.ఆర్.రహమాన్ సంగీతం అందించిన ఐ చిత్రంలోని 'నువ్వుంటే నా జతగా....' అనే పాటను వయొలిన్‌పై అంతే మధురంగా పలికించాడు చెన్నైకు చెందిన మనోజ్‌కుమార్. ఈ వీడియోను ఇరవై రెండు లక్షల మంది వీక్షించారు. మనోజ్ తన ఏడవ ఏట నుంచే కర్ణాటక సంగీతాన్ని నేర్చుకున్నాడు. గురువు శ్రీ మురళీ రాఘవన్ వద్ద పాఠాలు నేర్చుకుంటున్నాడు. ప్రస్తుతం పాశ్చాత్య సంగీతానికి చెందిన 'ద ఫిడేల్ అండ్ ద క్వీ[illegible]అనే బ్యాండ్‌లో సభ్యుడిగా ఉన్నాడు. సినిమా పాటలకు కూడా సంగీతాన్ని అందించేంత ఎత్తుకు ఎదిగినా..ఇన్‌స్ట్రుమెంటల్ సంగీత అభిమానుల కోసం కవర్స్ చేస్తున్నాడు. తన కంటూ ప్రత్యేకత తెచ్చుకుంటున్నాడు. మనోజ్ చేసిన ఇళయరాజా, మణిరత్నం బర్త్‌డే మాష్‌అప్ కవర్‌ను పది లక్షల మంది వీక్షించారంటే అంతమంది అభిమానులను మెప్పించాడని తెలుస్తోంది. ఈ పాట విన్న ప్రేక్షకులు ఒళ్లు గగుర్పొడిచిందంటూ చేసిన కామెంట్లు అతనికి మరింత ప్రోత్సాహాన్నిస్తున్నాయి.

- కోడే హేమలత

దేశీ వాద్యాల..!

ఆలనగా.. లాలనగా...

- రాజేష్ యాళ్ల
97004 67675

కథ

"నాకేం వద్దమ్మా!" తల్లిపై గట్టిగా అరిచింది ఇరవయ్యేళ్ళ లాలన.

"ఉదయం నుంచీ ఏమీ తినలేదు కదరా తల్లీ...! ఈ పాలైనా తాగితే నీరసం ఉండదు." ఒక చేత్తో అనునయంగా లాలన తల మీద వేసి నిమురుతూ మరో చేతిలోని గ్లాసును ఆమె నోటికి అందించబోయింది అర్చన.

"నాకసలేమీ వద్దన్నానా? అరక్షణంలో దూరంగా జరిగిపోయి తిరిగి అరిచింది లాలన.

"లాలీ... మరీ ఇంత మొండి పట్టుదల ఉండకూడదురా! అసలు నీకేం తక్కువ చేసామని? నాకంటే నిన్ను నెత్తికెక్కించుకున్న మీ నాన్నయితే చిన్నప్పటినుంచీ నువ్వడిగిన ప్రతిదీ ఇస్తూనే ఉన్నారు. ఆయనేం చేసినా అన్నీ ఆలోచించే చేస్తారమ్మా!" కూతురుకు ఎంతో సౌమ్యంగా చెప్పింది అర్చన.

"ఆ... ఇప్పుడడిగింది ఇచ్చేసారనీ!" ఈసడింపుగా అంది లాలన. అందమైన ఆమె కనుల నిండా నీళ్ళు!

"జీవితంలో అతిముఖ్యమైన విషయాలను పెద్దవాళ్ళకు వదిలేస్తేనే మంచిది లాలీ! ఇరవైరెండేళ్ళుగా చూస్తున్నాను. నాన్న ఏ నిర్ణయం తీసుకున్నా తప్పుగా తీసుకోరు. నీ విషయంలో అయితే మరీ చక్కగా ఆలోచించే చేస్తారు." అర్చన చెప్పింది.

"అవును మనసును ముక్కలు ముక్కలుగా నరకడం!" కోపంగా అంది లాలన.

"నువ్వు నీ టీనేజ్‌ని దాటి ఒక్క ఏడాదే అయిందిరా లాలీ! ఈ వయసులో మీకు ఆవేశం తప్ప ఆలోచన అంటూ ఉండదు. కొంచెం నీ కోపాన్ని తగ్గించుకుని నిదానంగా ఆలోచిస్తే అన్నీ అర్థం అవుతాయి." కూతురి ప్రవర్తన ఆమెకు ఎంత కోపాన్ని తెప్పిస్తున్నా దానిని బలంగా అదిమిపెట్టి తన స్వరాన్ని మృదువుగా మార్చి చెబుతోంది అర్చన.

"లేదమ్మా మీ పెద్దవాళ్ళంతా అంతే. ఎప్పుడూ మీ ఆలోచనలే కరెక్ట్ అనుకుంటారు. మీ చాదస్తాలకు మేం బలైపోతూ ఉంటాము." ఉక్రోషంగా ముక్కెగరేస్తూ చెప్పింది లాలన.

"సరే... నీకు ఆకలి వేస్తే ఈ పాలు తాగు. మూత పెట్టి వెళుతున్నాను. మీ నాన్న ఉంటే ఇలా రోజంతా నువ్వు కడుపు మాడ్చుకునే పరిస్థితి రానివ్వరు. సమయానికి ఆయన లేరు. క్యాంప్‌నుంచి వచ్చేసరికి అర్ధరాత్రి దాటిపోతుందన్నారు."

"అవును. మీ మాట... ముఖ్యంగా నాన్న మాట కాదవలేని నా బలహీనతే మీకు బలం. అందుకే నా జీవితంలో నేను తీసుకోవాల్సిన నిర్ణయాలను కూడా ఆయనే శాసిస్తారు."

"ఎప్పుడూ అలా అనుకోవద్దురా లాలీ! అది సరే, నీకు కాస్త ఊరటగా ఉంటుంది... ఈ రాత్రికి నీకు తోడుగా ఇక్కడే పడుకోమంటావా?"

"నీ ఆలోచన ఏమిటో నాకు తెలుసులేమ్మా! నేనంత పిరికిదాన్ని కాదు.. మీ గదిలోనే పడుకో." చెప్పింది లాలన.

"సరేరా! పడుకునేలోపుగా ఆ పాలు తాగి బజ్జో కన్నా!" కూతురును బతిమాలి గది బైటకు వెళ్ళింది అర్చన. అమ్మ నాన్న గురించి చెప్పిన మాటల గురించే ఆలోచిస్తూ నిస్త్రాణగా కూర్చుంది లాలన. ఆమె చిన్నప్పటినుంచీ నాన్న ఒత్తిన అడుగులకు మడుగులన్నీ ఒక్కొటొక్కటిగా మనసుతెర మీద ప్రత్యక్షం అవసాగాయి.

• • •

"సర్... దిస్ ఈజ్ నాట్ ఫెయిర్. డూ యూ నో వాట్ యూ ఆర్ డూయింగ్?" ఉరిమినట్టుగా అడిగింది క్లాస్ టీచర్.

"యా... ఐ నో... బట్ మై చైల్డ్ హేస్ నాట్ హేడ్ ఫుడ్ ఇన్ ద మాణింగ్." నాన్న కూడా గట్టిగానే చెప్పాడు.

"అందుకని క్లాసులోకి వచ్చి తినిపిస్తారా? మిగతా పిల్లలు కూడా అలాగే కావాలంటే అప్పుడు మేమేం చెయ్యాలి? ప్రిన్సిపల్ సర్ కేకలేస్తారు సర్. దయచేసి వెళ్ళిపొండి."

"అయితే లంచ్ అవర్ ఇలా పిల్లలను కట్టేసినట్టు కాకుండా బైటకు వదలండి మేడం. పేరెంట్స్‌ని కూడా వీళ్ళను కలవడానికి అనుమతించండి. ఇంకా తమకు తాము తినడమే సరిగ్గా రాని వయసులోని చిన్నపిల్లలు వీళ్ళు."

"కానీ స్కూల్ రూల్స్ కూడా అందుకు ఒప్పుకోవాలి కదా సర్. ప్లీజ్ ట్రై టూ అండర్‌స్టాండ్!" చెప్పింది టీచర్.

"అలాగే. మీరేం వర్రీ అవ్వకండి. లెట్ మీ

ఫినిష్ ఆఫ్ దిస్ జాబ్. మీ ప్రిన్సిపల్ గారితో ఇప్పుడే మాట్లాడతాను." అని చెప్పి బాక్స్‌లో అమ్మ పెట్టిన అన్నమంతా తినిపించి తనకు నవ్వుతూ బై చెప్పి వెళ్ళాడు నాన్న.

ఏం మాట్లాడారో నాన్న తెలీదు కానీ, ఆ తర్వాత రోజునుంచీ లంచవర్లో పిల్లలను స్కూల్ గ్రౌండ్‌లోకి రానివ్వడం, తల్లులంతా వచ్చి తినిపించడం మొదలయింది. చాలామంది తల్లిదండ్రులొచ్చి 'లాలన అంటే ఈ పాపే! వాళ్ళ డాడీ గ్రేట్!" అంటూ ఉంటే తనెంతో గర్వపడిపోయేది.

● ● ●

"అన్ని స్కూల్స్‌లోనూ పిల్లలను అలా అనుమతిస్తున్నారు సర్!" ప్రిన్సిపల్ రూం బైట కూర్చున్న తనకు నాన్న గొంతు లోపలినుంచి వినిపిస్తోంది.

"మా స్కూల్ విషయం మీకు తెలుసు కదా సర్. తప్పదు. రూల్స్ పాటించవలసిందే. యూనిఫాం లేకుండా పిల్లలను ఊహించుకుంటేనే నాకు కంపరంగా ఉంటుంది. అసలు యూనిఫాం అంటే పిల్లలో ఒక సమానత్వ భావాన్ని కలిగిస్తుంది తెలుసా మీకు?" ప్రిన్సిపల్ కంఠం ఖంగుమంది.

"ఒప్పుకుంటాను. నేను ఒక్క శనివారానికే యూనిఫాంనుంచి పిల్లలను మినహాయించమని కోరుతున్నాను సర్." నాన్న కూడా తగ్గడంలేదు. తనకు కొంచెం బాధగా ఉంది, అనవసరంగా నాన్నతో ఈ విషయం చెప్పానేమో అని.

"నో సర్. దట్ ఈజ్ నాట్ ఎటాల్ పాజిబుల్." గట్టిగా చెప్పాడు ప్రిన్సిపల్.

"నేనొకటి అడుగుతాను. దయచేసి దానికి సమాధానం చెప్తారా సర్?" నాన్న ప్రశ్నించాడు.

"యెస్."

"పిల్లలను రోజూ యూనిఫాంలో కుక్కేసి వాళ్ళను కనీసం వారానికోరోజైనా వాళ్ళు సరదా పడే రంగురంగుల బట్టలు, రకరకాల డ్రస్సులు వేసుకోనీకుండా మీరు రూల్స్ పెట్టారు కదా! మరి మీరెందుకు యూనిఫాం మెయింటెయిన్ చెయ్యడంలేదు?!" సూటిగా అడిగాడు నాన్న.

"టూమచ్ సర్. మాకు యూనిఫాం ఏంటి అసలు? అలా ఎక్కడా ఉండదసలు." ప్రిన్సిపల్ కోపంగా చెప్పాడు.

"శనివారం పిల్లలను మామూలు బట్టల్లో అనుమతించడం కూడా ఎక్కడా లేకుండా లేదు సర్. రకరకాల ఆనందాలు వెదుక్కునే పసిమనసులకు మీరు రుద్దే నియమనిబంధనలు, పెట్టే ఆంక్షలు ఎంత బాధ పెడతాయో మీరసలు ఎప్పుడైనా ఊహించారా? ఒక్క విద్యాబోధనే కాదు సర్. మిగతా విషయాల్లోనూ మనం పిల్లలకు అన్నీ ఇవ్వగలుగుతున్నామా లేదా అని ఆలోచించాలి. మీకు కానీ నాకు కానీ చిన్నప్పుడు ఇలాంటి కాన్వెంట్ స్టడీస్ లేవు. ఒక్కసారి వెనక్కు వెళ్ళి మీ బాల్యాన్ని తలుచుకోండి. కనీసం అందులో పదో వంతైనా ఇప్పుడు మీ స్కూల్ పిల్లలకు అందించగలుగుతున్నారా? టేక్ ఏ డెసిషన్ సర్. లేకపోతే నా నిర్ణయం నేను తీసుకుంటాను." నాన్న బైటకొచ్చేశాడు.

అంతే... ఆ తర్వాతి శనివారం నుంచి యూనిఫాం తప్పనిసరి కాదని రూల్ పాస్ చేశారు. ఆ



కానీ చిన్నప్పుడు ఇలాంటి కాన్వెంట్ స్టడీస్ లేవు. ఒక్కసారి వెనక్కు వెళ్ళి మీ బాల్యాన్ని తలుచుకోండి. కనీసం అందులో పదో వంతైనా ఇప్పుడు మీ స్కూల్ పిల్లలకు అందించగలుగుతున్నారా? టేక్ ఏ డెసిషన్ సర్. లేకపోతే నా నిర్ణయం నేను తీసుకుంటాను." నాన్న బైటకొచ్చేశాడు.

నోటీస్ రాగానే తన తోటిపిల్లలంతా చేసిన కేరింతలు ఇప్పటికీ తన చెవుల్లో మధురంగా వినిపిస్తూనే ఉంటాయి.

● ● ●

"సైకిల్ మీద వెళతావా? వద్దురా లల్లూ... అయినా మీ స్కూల్ ఎంత దూరం చెప్పు... రోజూ నేను దింపేస్తున్నానుగా! ఇంటికొచ్చేటప్పుడు మమ్మీ తీసుకొచ్చేస్తుంది కదా!" నాన్న కంఠంలో అదో ఆదుర్దా. అప్పుడు తను ఏడో క్లాసుకొచ్చింది.

"మా క్లాసులో సగం మందికి పైగా సైకిల్ మీదే వస్తున్నారు నాన్నా... ప్లీజ్!"

"నాన్న అంత భయపడుతున్నారంటే నీ గురించే కదా లాలీ... కొంచెం ఆలోచించు. ఇంకొంచెం పెద్దయ్యాక వెళు దువుగానిలేమ్మా!" అర్చన బుజ్జగించింది.

"మరి అలాంటపుడు సైకిల్ నాకు బర్త్‌డే గిఫ్ట్‌గా కొనిపెట్టడం ఎందుకూ? ఇంట్లో పెట్టి పూజించడానికా? ఏ ఆదివారం రోజో మన చిన్న వీధిలో అటూ ఇటూ ఓ అరగంట తొక్కడం తప్ప, ఇంతవరకూ నా సైకిల్ సరదా తీరినట్టే లేదు." దిగాలుగా చెప్పింది తను.

అప్పుడు కలగచేసుకున్నారు నాన్న.

"సర్లే లల్లూ, నువ్వు సైకిల్ అసలు తొక్కకూడదని కాదు మా బాధ. మీ స్కూల్ మెయిన్‌రోడ్లో ఉంది కదరా... ఏమైనా ప్రమాదాలు అవుతాయేమో అని భయం అంతే! జాగ్రత్తగా వెళ్ళి వస్తానంటే సరే!"

"థ్యాంక్యూ నాన్నా! నువ్వు చాలా

మంచివాడివి!" అంటూ ఆనందంగా నాన్నను వాటేసుకుంది తను.

• • •

రెండేళ్ళ క్రితం ఒకరోజు తను కాలేజీ నుంచి ఇంటికి ఏడ్చుకుంటూ వచ్చింది.

అప్పటికే నాన్న ఇంటికి వచ్చి ఉన్నారు. ఏడుస్తున్న తనను చూడగానే ఎదురొచ్చి, "ఏమయిందిరా లల్లూ?!" అని ఆందోళనగా అడిగారు.

మరోపక్కకు చేరి అమ్మ కూడా బుజ్జగిస్తూ అడిగింది... "ఊరుకోరా తల్లీ... ఏమయిందిరా బుజ్జీ!"

వెక్కి వెక్కి ఏడుస్తూ తన క్లాస్మేట్ ప్రతీక్, ఇంకొందరు క్లాస్మేట్స్‌తో కలిసి తనను ప్రతిరోజూ టీజ్ చేస్తోన్న విషయం చెప్పింది తను. ఆ విషయం వినగానే నాన్నలో అంతకుముందెపుడూ చూడని కోపాన్ని చూసింది తను.

"ఏమనుకుంటున్నాడు వాడు? వాడిల్లు తెలుసా? పదరా లల్లీ!" దిగ్గుమని సోఫాలోంచి లేస్తూ అడిగారు నాన్న.

"వద్దులే నాన్నా వాడు మినిస్టర్ కొడుకట." చెప్పింది తను.

"మినిస్టర్ అయితే మనకేంటటా, వాడు చేసింది తప్పు. నీ జోలికొస్తాడా? పద ముందు."

"ఏమండీ కొంచెం ఆలోచించండి. వాళ్ళు రాజకీయ నాయకులు. తెలిసీ అలాంటివాళ్ళతో తగవు పెట్టుకోవడాం రిస్క్ అవుతుందేమో కదా!" అమ్మ భయంగా చెప్పింది.

"రిస్క్ అని పిల్లను రోజూ చెత్తమాటలంటూ ఏడిపిస్తే ఊరుకుంటామా అర్చనా?!" నాన్న కోపంలో ఏమాత్రం మార్పు లేదు.

"ఈసారికి ఊరుకో నాన్నా! మళ్ళీ ఏమైనా అల్లరి చేస్తే అప్పుడు చూద్దాంలే!" సర్దిచెప్పింది తను.

తన మాటలు నాన్నపై కొంత ప్రభావం చూపాయి. "సరేలే లల్లూ." అంటూ తిరిగి కూర్చున్నారు.

కానీ విషయం అంతటితో ఆగలేదు. పేపర్ వాళ్ళనూ టీవీ ఛానెల్స్ వాళ్ళనూ చాలామందిని కూడగట్టుకుని తర్వాతిరోజు ఉదయమే ఆ మినిస్టర్ ఇంటికి వెళ్ళిపోయారు నాన్న. ప్రతీక్ గురించి చెప్పి ఈ వార్తను ప్రసారం చెయ్యదల్చుకున్నామని ఆ మంత్రితో చెప్పారు నాన్న. అప్పటికే ఆ మంత్రిపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. పదవి రేపో మాపో అన్నట్టుగా ఉంది. మీడియా వాళ్ళ కాళ్ళావేళ్ళా పడి, నాన్నను బతిమాలి కారులో కూర్చోబెట్టి అతని వెంటే ప్రతీక్‌ని కూడా ఇంటికి పంపించి తనకు వాడి చేత క్షమాపణ చెప్పించాడాయన.

"ఇలాంటి విషయాలకు ఊరుకోకూడదు లల్లూ! బుద్ధి చెప్పాల్సిందే!" ప్రతీక్ వెళ్ళిపోయాక చెప్పారు నాన్న, ఆరాధనగా తను ఆయన్నే చూస్తోంటే!

కానీ, చిన్నప్పటినుంచీ తనను అంత అల్లారుముద్దుగా చూసుకున్న నాన్న ఒక్కసారిగా ఎందుకు మారిపోయారు? నిన్నటినుంచీ తన గుండెను మెలిపెడుతూ ఆగని దు:ఖాన్ని కలిగిస్తోన్న విషయం అదే! పిల్లలు తమ ప్రేమ విషయం చెప్పగానే తల్లిదండ్రులు ఎందుకు ఒక్కసారిగా కఠినాత్ములుగా మారిపోతారు?

వారం క్రితం ఒక రాత్రి భోజనం చేస్తూండగా తను రోహిత్ విషయం నాన్నతో చెప్పింది. అమ్మ భయంగా చూసింది. నాన్న ముఖంలో ఏ భావాలూ కనపడలేదు. "నువ్విలా షాక్ ఇస్తావని ఎప్పుడూ అనుకోలేదురా లల్లూ! నాలాంటి ప్రతి తండ్రీ ప్రేమించిన తన కూతురి గురించి ఇలాగే అనుకుంటాడేమోలే. సరే... నాకో వారం టైమివ్వు. ఆలోచించి చెబుతాను." అన్నారు.

నిన్నటితో వారం గడిచింది. రాత్రి భోజనాలు పూర్తయ్యాక అమ్మతో కలిసి నాన్న తన గదిలోకి వచ్చారు. తనకు చెరోవైపునా కూర్చున్నారు. నాన్న తన తల నిమురుతూ..."సారీరా లల్లూ... నీది రాంగ్ ఛాయిస్. రోహిత్‌ని మర్చిపోవడానికి ప్రయత్నించమ్మా! మంచి మేచ్ చూసి నీకు పెళ్ళి చేస్తాను."

ఆ మాట తన పాలిట శరాఘాతమే అయ్యింది. కళ్ళలోంచి వరద గోదారే పొంగింది. "నాన్నా నేను రోహిత్‌ని తప్ప ఇంకెవర్నైనా చేసుకోవడం అసాధ్యం. ప్లీజ్ నాన్నా!" తన ఏడుపు పట్టించుకోకుండా దిక్కులన్నీ పెక్కుటిల్లేలా కేక పెట్టారు నాన్న... "మర్చిపొమ్మని ఒక్కసారి చెప్తే అర్థం కాదా నీకు?" అవాక్కవడం తన వంతయింది. ఆ క్షణంనుంచి ఈ క్షణం వరకూ కన్నీరుమున్నీరుగా తను ఏడుస్తూనే ఉంది.

• • •

బుజ్ బుజ్ మంటూ ఎడతెరపి లేనట్టుగా వినవచ్చిన వాట్సాప్ సందేశాల రొదకు ఫోన్ వైపు చూసింది లాలన. ఆమె క్లాస్మేట్స్ గ్రూప్లోనివే చాలావరకూ అవి. ఆమె స్నేహితులనుంచి కూడా వస్తూనే ఉన్నాయి. క్లాస్మేట్స్ గ్రూప్ తెరిచింది ముందుగా. అందులో సందేశాలు చూడగానే దిగ్భ్రాంతితో ఆమె కళ్ళు పెద్దవయ్యాయి. అనేకమంది అమ్మాయిలతో ప్రేమాయణం నడిపి వారిని వంచిస్తోన్న రోహిత్‌ని పోలీసులు అరెస్ట్ చేశారని వాటన్నింటి సారాంశం!

ముందుగానే తెలియడం లాలన అదృష్టమని కొందరు. సారీ అని కొందరు. అలా వరుసగా సందేశాలు పంపిస్తూనే ఉన్నారు.

ఓ మై గాడ్! అయ్యో!! తన కలలసౌధం ఒక్కసారిగా కూలిపోయింది! మనసులో కట్టుకున్న ప్రేమగూడు చెదరిపోయింది! ఎంతో మంచివాడు తన రాకుమారుడు అనుకున్న ఆ రోహిత్ ఇంతటి నయవంచకుడా?! ఎంత పిచ్చిదానిలా తను అతని వెంట తిరిగింది! అందుకేనా నాన్న రోహిత్ నీకు తగినవాడు కాదని చెప్పారు?!

ఏడాది కాలంగా రోహిత్ మనసును తను క్షుణ్ణంగా చదివేశానని గర్వపడేది, కానీ, కేవలం వారం రోజుల్లో రోహిత్ గురించి వాకబు చేసి వాడి బారినుంచి తనను రక్షించారు నాన్న!

అయ్యో... తనలాంటి అమాయకులైన ఎందరో అమ్మాయిలను వలలో వేసుకుని వాళ్ళ జీవితాలను నాశనం చేసే ఆ దరిద్రుడి కోసమా ఇంతవరకూ తను కన్నీరు కార్చింది! అది కూడా ఇన్నేళ్ళూ తనను అపురూపంగా చూసుకున్న నాన్నను రాక్షసుడిలా తప్పుగా భావించి మరీ!

లాలన కళ్ళు మళ్ళీ అశ్రువులతో నిండిపోయాయి. కానీ తేడా ఒక్కటే! ఇప్పుడా కన్నీళ్ళెంతో స్వచ్ఛంగా ఉన్నాయి... కాసేపట్లో రాబోతున్న నాన్న మునివేళ్ల స్పర్శను హత్తుకోడానికి...

✦

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలుకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా ఉండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢ నమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా ఉండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా ఉండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో ఉం డాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో ఉండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒక వైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. పేరు, పూర్తి చిరు నామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరు నామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com

ooo

జీవన పాఠం

బాలల కథ

అన్విత ఆటో దిగగానే పరుగెత్తుకుంటూ హెడ్ మాస్టర్ గదిలోనికి ప్రవేశించింది. 'సార్, మా తరగతిలో ఉండే అఖిల్ మేం స్కూలుకు వస్తున్న ఆటోకు ఎదురుగా బైక్‌లో వెళ్లడం చూసాను సార్. ఎవరో అంకుల్ నడుపుతున్నాడు. వెనుక ఒక ఆంటీ ఉంది మధ్యలో అఖిల్ ఉన్నాడు. ఆ బైక్ నెంబర్ చూసి వెంటనే పేపర్లో రాసుకున్నాను' అంటూ పేపర్లో రాసిన నెంబర్ ఇచ్చింది.

ఆ మాటలు విన్న హెడ్ మాస్టర్ మనస్సులో ఏదో అనుమానం.. 'అన్వితా, వెరీగుడ్.. చాలా మంచి పని చేశావు. నువ్వు ప్రేయర్‌కు వెళ్లు' అని చెప్పగానే వెనక్కు తిరిగి వెళ్ళింది.

వెంటనే పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేసి 'గుడ్ మార్నింగ్ సర్, నేను, ప్రభుత్వ పాఠశాల హెడ్ మాస్టర్ రాంమూర్తిని మాట్లాడుతున్నాను. ఐదవ తరగతి చదువుతున్న అఖిల్ అనే అబ్బాయి ఏదో బైక్‌లో వెళ్ళాడట.! ఇదొక చిన్న అనుమానం. ఇంకా వాళ్ల తల్లితండ్రులను అడగలేదు. ముందుగా మొదట మీకు ఇన్ఫర్మేషన్ ఇస్తున్నాను. అదే తరగతిలో చదువుతున్న అన్విత అనే అమ్మాయి చూసి ఇప్పుడే చెప్పింది. ఎవరో ఒక జంట మధ్య అఖిల్ ఉన్నట్లు చెప్పింది. ఆ బైక్ నెంబర్ చూసి వెంటనే ఒక పేపర్లో రాసుకుని నాకు తెచ్చి ఇచ్చింది.' అంటూ ఆ బైక్ నెంబర్ చెప్పారు హెడ్‌మాస్టర్ రాంమూర్తి.

'ఆ జంట ఎలాంటి దుస్తులు వేసుకున్నారో ఆ అమ్మాయి చెప్పగలదా' అని అడిగాడు ఇన్‌స్పెక్టర్.

'సార్ ఒక నిమిషం అలాగే లైన్‌లో ఉండండి, ఆ అమ్మాయిని పిలిచి అడిగి చెబుతాను.' అంటూ వేగంగా వెళ్ళి ప్రేయర్ కోసం వరుసలో నిలబడిన అన్వితను పిలిచి అడిగాడు.

'సార్ ఆ అంకుల్ ఎలాంటి దుస్తులు వేసుకున్నాడో గమనించలేదు. కానీ, ఆంటీ నల్ల ప్యాంటు తెల్ల టీ షర్ట్ వేసుకొన్నది.' అని సమాధానం చెప్పగానే వెంటనే వేగంగా వెళ్లి ఇన్‌స్పెక్టర్‌కు చెప్పాడు.

ఫోన్ కట్ చేశాక అఖిల్ తండ్రికి ఫోన్ చేసి మాట్లాడారు హెడ్‌మాస్టర్. 'అఖిల్‌ను స్కూటర్ మీద తీసుకుని వచ్చి.. స్కూల్ దగ్గరకు రాగానే నడచి వెళతాను అంటే, అక్కడే వదలి ఆఫీస్‌కు వెళ్లాను' అని చెప్పాడు అఖిల్ తండ్రి.

'అఖిల్ ఇంకా స్కూలుకు రాలేదు మీరు వెంటనే బయలుదేరి రండి' అన్నారు రాంమూర్తి మాస్టారు.

•••

బడి ఆవరణలో వేదిక మీద సూపరిండెంట్ ఆఫ్ పోలీసు వంశీతో పాటు హెడ్ మాస్టర్, అన్విత కూర్చొని ఉన్నారు. వేదిక ముందు విద్యార్థులు కూర్చొని ఉన్నారు. ఇతర ఉపాధ్యాయులు, పిల్లల తల్లితండ్రులూ నిలబడి ఉన్నారు.

ఎస్.పి.వంశీ తన ప్రసంగంలో 'ఈ రోజు మా డిపార్ట్‌మెంట్‌కు చాలా మంచి రోజు. ఒక్క ఐదు నిమిషాలు ఆలస్యం అయివుంటే ఈ పట్టణంలో దొంగలించబడ్డ పది మంది పిల్లల్ని ఆ దొంగలు తీసుకెళ్లిపోయి ఉండేవాళ్లు. ఆ తర్వాత మేం వాళ్ళ కోసం ఎక్కువ శ్రమపడాల్సి వచ్చేది. అఖిల్ ఈ రోజు స్కూలుకు ముందుగా వచ్చాడు. అక్కడ పొంచి ఉన్న దొంగలు బైక్‌లో ఎక్కించుకొని అరవడానికి అవకాశం లేకుండా అఖిల్‌కు మత్తుమందు వాసన చూపించి స్పృహ తప్పేలా చేశారు. ఈ చిన్నారి అన్విత అందించిన క్లూ వల్ల ఆ దొంగల ముఠాను చాల సులభంగా పట్టుకొన్నాం.' అంటూ చెప్పి ముగించిన తర్వాత అన్విత వైపు చూస్తూ 'అన్వితా, అఖిల్ను చూడగానే బైక్ నెంబర్ చూసి వెంటనే పేపర్ నందు రాయాలన్న ఆలోచన ఎలా వచ్చింది?' అని అడిగారు.

'అంకుల్ మా హెడ్‌మాస్టర్ గారు నీతి కథల పిరియడ్‌లో 'ఈ మధ్య పిల్లల దొంగతనాలు ఎక్కువయ్యాయి. చిన్న పిల్లలైనా మీరు ఈ విషయంలో అనుకొంటే ఆ దొంగలను పట్టుకొనడానికి అవకాశం ఉంటుంది. ఎలాగంటే మీకు తెలిసిన పిల్లలు వేరేవారి బండిలో వెళుతున్నారన్న అనుమానం కలిగితే.. వెంటనే ఆ బండి నంబర్ గుర్తుపెట్టుకుని వెంటనే ఓ పేపర్‌పై రాసుకుని స్కూలులోనో లేక మీ ఇంటిలోనో ఇచ్చి వెంటనే విచారించమనండి' అని చెప్పారు. అందుకే ఈ వేళ అఖిల్‌ను చూడగానే అనుమానం కలిగి హెడ్‌మాస్టర్ చెప్పిన విధంగా చేశాను' అంది అన్విత.

చప్పట్లతో ఆవరణ మారుమోగింది.

'బాధ్యతగా ప్రవర్తించిన చిన్నారి అన్వితకు ఒక బహుమతి. అలాగే నేటి జీవన పాఠాలు చెబుతూ వారి బాధ్యతలను వివరించి రేపటి పౌరులుగా తీర్చిదిద్దుతున్న హెడ్‌మాస్టర్ గారికి ఒక బహుమతి ఇవ్వాలని మా డిపార్ట్‌మెంట్‌లోని పై అధికారులు నిర్ణయించారు.' అన్నారు వంశీ.

మరోమారు ఆవరణ చప్పట్లతో మారుమోగింది.

- ఓట్ర ప్రకాష్ రావు
09787446026

డిప్రెషన్

సైన్స్ కథ



తీవ్ర అనారోగ్యం కారణంగా గృహిణి ఆత్మహత్య. మార్కులు సరిగ్గా రాలేదని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసిన ఇంటర్ విద్యార్థి. పేపర్ చదువుతున్న ప్రజ్ఞకు వాటిలోని విషయాలు కొంత భయాన్ని కలిగిస్తూ మనసులో అనేక సందేహాలు రేకెత్తించాయి.

అంతలోనే వచ్చిన ఫోన్‌కాల్, ఆదుర్దాగా మాట్లాడుతున్న అమ్మ!! తర్వాత కానీ, విషయం అర్థం కాలేదు. ఊర్లో ఉండే అక్క ప్రవల్లిక మార్కులు తక్కువ వచ్చాయన్న కారణంతో ఆ రోజు నుంచి ఎవరితో మాట్లాడకుండా, భోజనం కూడా చేయకుండా ఒంటరిగా తన గదిలోనే గడుపుతోందని.

పేపర్‌లోని విషయాలు, అక్క పరిస్థితి కలిపి, పరిస్థితుల ప్రభావం వల్ల ఎందుకు మనుష్యుల ప్రవర్తనలో మార్పులు వస్తాయో అర్థం కాలేదు ప్రజ్ఞకు.

సాయంత్రం నాన్న గారు వచ్చిన తర్వాత ప్రవల్లిక వాళ్ళ ఇంటి నుంచి మరొకసారి ఫోన్ రావడంతో విషయం అర్థమైంది. ప్రవల్లికను సైక్రియాటిస్ట్‌కు చూపించేందుకు రేపు వాళ్ల నాన్నగారు విజయవాడ వస్తున్నారని ఆ ఫోన్ సారాంశం.

తర్వాత రోజు అనుకున్నట్లుగానే వాళ్లు వచ్చి అందరూ కలిసి ప్రముఖ సైక్రియాటిస్ట్ దగ్గరకు వెళ్లి విషయం చెప్పారు.

ప్రవల్లిక ఊహించని విధంగా, మార్కులు తక్కువ రావటం వల్ల కొంత డిప్రెషన్‌కు లోనైందని కంగారు పడాల్సిన అవసరం లేదని వైద్యులు చెప్పటంతో వారంతా కొంత కుదుటపడ్డారు, పూర్తిగా కోలుకునే దాక మందులు వాడుతూ చెప్పిన జాగ్రత్తలు తీసుకోవాలని, చెబుతూ..... సెమినార్ హాల్లో కూర్చోమని చెప్పి అందర్నీ అటెండర్‌తో అక్కడికి పంపించారు. అందరితో పాటు ప్రజ్ఞ కూడా అక్కడికి చేరుకుంది.

మానసిక వ్యాధుల గురించిన అవగాహన కలిగించి తద్వారా, రోగి త్వరగా కోలుకునే విధంగా చేయాలని ఈ మీటింగ్ ఏర్పాటు చేశారని అందరికి అర్థమైంది.

అందులో ప్రధాన డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ...

'చదువుల్లో ర్యాంకులు సాధించటం కోసం ఎప్పుడూ అదే ధ్యాసలో ఉండే టీనేజర్లు తరచుగా ఈ డిప్రెషన్‌కు గురవుతారు. చదువు పూర్తైన తర్వాత పోటీ ప్రపంచంలో తట్టుకోగలమా లేదా అనే భయం యువతలో నానాటికి పెరిగిపోతూ డిప్రెషన్‌కు గురౌతున్నారు. ఇలాంటి పరిస్థితి మీ పిల్లలకు రాకుండా ఉండాలంటే వారి ప్రవర్తన ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని' హెచ్చరించారు.

'పిల్లలు డిప్రెషన్‌లో ఉన్నట్లు మనకు ఎలా తెలుస్తుంది డాక్టర్ గారు?' అని అమ్మ అడిగిన ప్రశ్నకు సమాధానంగా..

'చాలా ముఖ్యమైన విషయం

అడిగారమ్మా.. ప్రతి ఒక్కరూ తప్పకుండా తెలుసుకోవాల్సిన విషయం ఇదే.

పిల్లలు చాలా త్వరగా ప్రతి చిన్న విషయానికి కోపం తెచ్చుకోవటం, అందరి మీద విసుక్కుంటూ ఉంటే, కుటుంబసభ్యులకు, స్నేహితులకు, ఫంక్షన్స్‌కు కూడా దూరంగా ఉంటే దానిని బిడియంగా భావించకుండా, పిల్లలు డిప్రెషన్‌లో ఉన్నప్పుడు కుడా అలా ప్రవర్తిస్తారని గుర్తు పెట్టుకోవాలి.

ఎప్పుడైతే పిల్లలు ఒంటరిగా ఉండాలని కోరుకుంటారో వారిని ఆ పరిస్థితి నుంచి సాధ్యమైనంత త్వరగా బయటకు తీసుకురావడానికి తల్లిదండ్రులు ప్రయత్నించాలి. ఎదుటి వారిపై దాడికి దిగటం, తమను తాము శిక్షించుకోవడం, గాయపరుచుకోవడం, కొట్టుకోవటం వంటి లక్షణాలు పిల్లల్లో కనిపించిన వెంటనే వైద్యనిపుణుల్ని సంప్రదించాలి' అని వివరించారు.

'మరే ఇతర కారణం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుందో చెప్పండి సార్?' ప్రవల్లిక తండ్రి అడిగిన ప్రశ్నకు సమాధానంగా..

'శారీరక రుగ్మతలు కూడా కొన్ని సందర్భాలలో డిప్రెషన్‌కి దారి తీయొచ్చు. తరచూ పిల్లలు తలనొప్పి అని చెబుతూంటే, అది శారీరక రుగ్మత మాత్రమే కాదనే ఆలోచన చేయాలి. పిల్లలు ప్రవర్తనలో మార్పులు వస్తే, పెద్దల పట్ల వినయం తగ్గడం, గౌరవం లేకపోగా, నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే టీనేజ్ డిప్రెషన్‌గా గుర్తించాలని' వివరించారు. శ్రద్ధగా వింటోంది ప్రజ్ఞ..

'ఇలాంటి పిల్లల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పండి సార్?' అంటూ ఆందోళనగా అడిగిన అన్న ప్రశ్నకు సమాధానంగా..

'చాలా ముఖ్యమైన ప్రశ్న. ప్రతి తల్లితండ్రులు తెలుసుకోవాల్సిన విషయం ఇది.... డిప్రెషన్‌లో ఉన్న పిల్లలను వీలైనంత వరకు ఒంటరిగా ఉండకుండా చేయాలి. ఒంటరిగా ఉంటే తరచూ అవే ఆలోచనలు వచ్చి మరింతగా డిప్రెషన్‌కు గురి చేసే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, తీవ్ర డిప్రెషన్‌కి లోనైనప్పుడు కొందరు ఆత్మహత్యాయత్నం చేస్తారు.'

'అలాంటి పరిస్థితుల్లో ఏమి చెయ్యాలి డాక్టర్ గారు?' ఆందోళనగా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పటం కొనసాగించారు.

'అలాంటప్పుడు వారిని ఎప్పుడూ గమనిస్తూనే ఉండాలి, మంచి వైద్యుని సంప్రదించి డిప్రెషన్ నుంచి త్వరగా కోలుకునేలాగా చూడాలి' అంటూ క్లుప్తంగా వివరించారు.

'మానసికంగా ఆరోగ్యంగా ఉండటం అంటే ఏమిటో చెప్పండి డాక్టర్ గారు?' అని అడిగిన మరొకప్రశ్నకు సమాధానంగా..

'ఒక వ్యక్తి అతని లేదా ఆమె సొంత సామర్థ్యాలను గుర్తించగలిగి, జీవిత సాధారణ ఒడిదుడుకులను ఎదుర్కోగలిగి, నిర్మాణాత్మకంగా, సృజనాత్మకంగా పని చేయగలిగి, సమాజానికి సహాయపడే సామర్థ్యం కలిగి ఉండటం.' అని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచించింది' అని చెప్పారు.

'మనిషికి బాధలు రావటం సహజమే కదా సార్? కొంత కాలానికి అవి గుర్తు కూడా ఉండవు, మరి ఈ డిప్రెషన్ ఏ సందర్భంలో కలుగుతుంది?' ఆసక్తిగా అడిగిన ప్రశ్నకు సమాధానంగా..

'మీరు చెప్పింది పూర్తిగా జీవిత సత్యమండి. మనిషికి ఏదైనా బాధాకరమైన సంఘటన జరిగినా, అనుకున్నది జరగకపోయినా, ఆర్థికంగా నష్టపోయినా, మనస్సుకు బాధ కలిగినా.. కాలక్రమంలో మనం వాటిని మర్చిపోతాం, కానీ కొన్ని సందర్భాల్లో ఈ బాధలు, ఎక్కువ కాలం కొనసాగి, ఆ ఆలోచనల నుంచి బయటకురా లేకపోతారు. దీనినే డిప్రెషన్ అంటారు. దీనివల్ల



మానసిక దిగులు, నిస్సత్తువతో పాటు, శారీరక అనారోగ్యం కూడా చుట్టుముడతాయి.' అంటూ వివరించారు.

'డిప్రెషన్‌కు ఏమైనా దశలు ఉంటాయా సార్?' అన్న ప్రశ్నకు సమాధానంగా..

'డిప్రెషన్ మూడు దశల్లో ఉంటుంది. తీవ్రతను బట్టి మైల్డ్, మోడరేట్, సివియర్‌గా గుర్తించవచ్చని చెప్పారు.

'వాటి దశలను వివరంగా చెప్పండి సార్?' అని అడిగిన ప్రశ్నకు సమాధానంగా..

మొదటి దశలో మనోవ్యాకులత తక్కువగా ఉండటంతో పాటు, డల్‌గా ఉండటం, ఒంటరిగా ఉండడాన్ని మనం గమనించవచ్చు. ఈ దశలో వారి సామర్థ్యం తగ్గడం, రెండవ దశకు చేరుకున్న తర్వాత రోజువారీ కార్యక్రమాలు కుంటుపడతాయి, రోగి నిరాశతో ఉంటాడని, మూడవ దశలో తీవ్ర పరిణామాలు కనిపిస్తాయి. ఆత్మన్యూనతా భావంతో కుంగిపోతూ జీవించడం విచక్షణా రహితంగా ఆలోచించడం, ఆత్మనింద, ఆత్మహత్యా భావనలు ఉంటాయని' వివరించారు.

'ఆత్మహత్య చేసుకోవాలని ఎందుకు అనిపిస్తుంది సార్?' అంటూ ఆందోళనగా అడిగిన ప్రశ్నకు సమాధానంగా..

'రోగి ఆలోచనలకు విశ్లేషణాత్మక శక్తి, హేతువాద దృక్పథం పూర్తిగా క్షీణించడమే దీనికి ప్రధాన కారణం. అందుకే ఈ దశలో భయం, ఏకాగ్రత పోవటం, ఒంటరిగా ఉండటం, మానసిక అస్థిరత, అభద్రతా భావం, అనాసక్తి, విసుగు, కోపం, మతిమరుపు, భయం, వీటికి తోడు తలనొప్పి, తల తిరగటం, అజీర్తి, నిద్రలేమి, నీరసం, బద్ధకం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు రెండు వారాల కంటే ఎక్కువగా ఉన్నట్లయితే దీనిని డిప్రెషన్‌గా గుర్తించాలి' అంటూ వివరించారు.

'డిప్రెషన్ ఏ పిల్లలలో కనిపిస్తుంది?' అన్న ప్రశ్నకు సమాధానంగా..

'పిల్లల్లో డిప్రెషన్‌కు కారణం...ఇంటి వాతావరణం సరిగా లేకపోవడం, తల్లిదండ్రులు తరచుగా పోట్లాడుకోవడం, గృహహింసకు ప్రభావితం కావడం, మద్యం, పొగాకు లాంటి దురలవాట్లు కల పెద్దలు, ఆర్థిక ఒడిదుడుకులు ఇలాంటివన్నీ డిప్రెషన్‌కి దారితీస్తాయి' అని వివరించారు.

'డిప్రెషన్ నుంచి ఎలా బయటపడచ్చు డాక్టర్ గారు?' అన్న ప్రశ్నకు సమాధానంగా..

'మరచిపోవడం అనేది ఒక గొప్ప మెడిసిన్. ఏదైనా ఒక బాధాకర సంఘటనలు జరిగినప్పుడు దాని గురించి ఆలోచించకుండా, మర్చిపోయే ప్రయత్నం చేసినట్లయితే, డిప్రెషన్ నుంచి తేలికగా బయటపడే అవకాశం ఉంటుంది. దేనినైనా సరే పాజిటివ్‌గా తీసుకోవాలి. వ్యాయామం చేయడం, ఎనిమిది గంటల నిద్ర, సాయంత్రం 6 తర్వాత కాఫీ, టీ, కూల్‌డ్రింక్‌లు, నూనె పదార్థాలకు దూరంగా ఉండాలి. విటమిన్ డి లోపం కూడా డిప్రెషన్‌కు దారితీస్తుంది. కాబట్టి ప్రతిరోజూ సూర్యోదయ సమయంలో సూర్యరశ్మిలో కొద్దిసేపు గడపటం చాలా అవసరం. డాక్టర్ సలహా మేరకు విటమిన్‌డి సప్లిమెంట్స్ తీసుకోవాలి.

వీలు దొరికినప్పుడల్లా మంచి సాహిత్య పుస్తకాలు చదవడం, మెడిటేషన్ చేయడం, మీకిష్టమైన పనులు చేయడం, సరదాగా బయటకు వెళ్లడం మంచిది' అని వివరించారు.

అన్ని విషయాలు అవగాహన చేసుకున్న, వారంతా తమ వారు త్వరగా కోలుకుంటారన్న నమ్మకంతో వైద్యానికి సిద్ధపడ్డారు.

- సుంద్రు శ్రీనివాసరావు
94945 32570

మట్టీ-మనిషీ సంబంధాన్ని తెలిపే మట్టిపోగు

ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో ప్రజా జీవితాలన్నీ ఆటుపోట్లకు గురవుతూనే వున్నాయి. ముఖ్యంగా మట్టిని నమ్ముకున్న శ్రమజీవులు, రైతులు జీవితాలు మరింత దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ప్రపంచీకరణ విధానాలతో పాటు, ఇతర అనేక అంశాలు రైతు జీవితాన్ని సంక్షోభంవైపు నెట్టాయి. ప్రక తి వనరులు వ్యాపారత్మక మవుతున్న నేపథ్యంలో మట్టికీ, మనిషికీ మధ్య దూరం పెరుగుతోంది. 'మట్టిలో మట్టిగా మారాలని తపించినవాడు/ తన్ను తాను భూమిలో పాతుకుంటున్నాడు' అన్న కవి వ్యక్తీకరణ నేటి వాస్తవికత చిత్రణ. పల్లెటూరుని, రైతుని, మట్టిని, నీళ్లని కవిత్వంలో నింపి 'మట్టిపోగు' పేరుతో అందించారు పిళ్లా కుమారస్వామి. 54 కవితలున్న ఈ పుస్తకానికి రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, తెలకపల్లి రవి వంటి ప్రముఖ సాహిత్యకారులు అద్భుతమైన పరిచయాన్ని రాయడం కూడా ఒక విశేషం.

తొలకరి చినుకులతో పరవశించిన భూమి వెలువరించే కమ్మనైన మట్టివాసన... ఈ 'మట్టిపోగు' పుస్తకమంతటా, అన్ని కవితల్లోనూ పరిమళిస్తుంది. 'జీవకోటి ఇతిహాసంలో/ హెూమోసెపియన్ నిలుచున్నాడు మానవుడై', 'సంఘర్షణ ఇంధనంగా మారి/ నా కవిత్వాన్ని నడిపిస్తోంది', 'నా శ్రమలేని మగవాని జీవితం/ ఆకులు రాలిన హేమంతం', 'నా దేహంలో రాజ్యాంగానికున్నన్ని తూట్లున్నాయి', 'నన్ను నేను అక్షరాల ఉలితో చెక్కుకుంటూ కొత్త ఆకతి కోసం నేను అక్షరధార స్రవిస్తున్నాను' వంటి అనేక అర్థవంతమైన వాక్యాలు ఈ కవితల నిండా పరుచుకొని వున్నాయి.

పుస్తకం : మట్టిపోగు
రచన : పిళ్లా కుమారస్వామి
పేజీలు : 92, ధర : 100/-
ప్రతులకు : ప్రజాశక్తి బుక్ హౌస్, విశాలాంధ్ర పబ్లిషింగ్అన్ని బ్రాంచీలలో...
సెల్ : 94901 22229

'ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్న/ వెలుగురేఖలు నదులుగా మారి/ మట్టిని ముద్దాడి పిడికిళ్లుగా విస్తరిస్తున్నాయి' అంటూ 'కోయిల పాట కోసం' కవితలో భూమిపుత్రుల గుండెఘోషను ఆవిష్కరిస్తాడు రచయిత. 'ఒక విత్తు అప్పుల ఊబిలో/ ఊపిరాడక తనువు చాలిస్తుంది' అంటూ అప్పుల ఊబిలో చిక్కుకొని ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతుల గురించి 'ఒక విత్తు ఒక అక్షరం ఒక పోగు' కవితలో చెబుతాడు. అలాగే మరో మంచి కవిత 'ఒంటరి పక్షి'. 'నను గన్న నా పల్లె తల్లి/ నేల రాలిన ఎండుటాకుల్లా పడమటి గాలికి ఎగిరిపడుతోంది/ వలస పక్షులు వెళ్లిపోగా/ ఖాళీచేసిన ఇల్లులా నిశ్శబ్ద శ్మశాన మందిరంలా వుంది' అంటూ ఆవేదన చెందుతారు. 'నేను టీ తాగే చోట రెండు గ్లాసులు/ విభజన రేఖలా నిలిచినపుడు/ గాయపడిన మనసు/ ఊహకందని భాషతో విలవిల్లాడుతోంది' అని 'నగారా' మోగించాడీ కవి. ఈ కావ్యంలోని అన్ని కవితలూ దాదాపు చైతన్యం నింపేవిగా, ఆలోచింపజేసేవిగా వుంటాయి.

మొత్తంగా పిళ్లా కుమారస్వామి 'మట్టిపోగు' కవిత్వం... రాయలసీమ అస్థిత్వ వాదానికి, శ్రామిక వర్గానికి, మట్టిమనుషులకు, రైతులకు పక్షాన నిలిచిన కవితాత్మక కావ్యం. ఈ పుస్తకంలోని అన్ని కవితలనూ చదివి పక్కన పెట్టడం కాకుండా... వ్యక్తిగత లైబ్రరీలో వుంచుకోదగ్గ పుస్తకం.

- రాజాబాబు కంచర్ల



పుస్తకం : పదమూడు రోజులు
యూరప్ పర్యటన నేపథ్యంతో
రచయిత : కొయిలాడ రామ్మోహన్‌రావ్
పేజీలు : 160, ధర : 120/-
ప్రతులకు : 3-6.22, నరసింగరావ్ పేట, సాక్షి ఆఫీస్ దగ్గర, అనకాపల్లి-53001
సెల్ : 98493 45060

పుస్తకం : విరమించని వాక్యం
రచయిత : దాసరాజు రామారావు
పేజీలు : 130, ధర : 60/-
ప్రతులకు : పాలపిట్ట బుక్స్, 16-11-20/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీమ్ నగర్, మలక్‌పేట్, హైదరాబాద్ - 500036
సెల్ : 040-27678430

పుస్తకం : అభయం (నవల)
రచయిత : సింహప్రసాద్
పేజీలు : 200, ధర : 120/-
ప్రతులకు : పాలపిట్ట బుక్స్, 16-11-20/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీమ్ నగర్, మలక్‌పేట్, హైదరాబాద్ - 500036
సెల్ : 98487 87284

నవ్వుల్... పువ్వుల్

టీచర్ : బిట్టూ 16వ శతాబ్దం రాజుల గురించి నీకేమైనా తెలుసా?

బిట్టూ : తెలుసు టీచర్

టీచర్ : గుడ్... ఏం తెలుసో చెప్పు?

బిట్టూ : వాళ్లంతా చనిపోయారు టీచర్..



వెంగళప్ప ఎప్పటిలాగే ఇంటిపక్కనున్న సూపర్‌బజార్‌కు వెళుతున్నాడు..

అయోమయం : ఏరా! ఎక్కడికి బయలుదేరావ్?

వెంగళప్ప : సరుకులు తేవడానికి సూపర్ బజారుకు వెళుతున్నాను.

అయోమయం : ఆ సూపర్ బజారుకు వెళ్లకురా.. షాపు ఓనరు పచ్చి మోసగాడు మొన్నామధ్య ఒక స్వీట్ ప్యాకెట్ కొన్నాను. దానిపై షుగర్ ఫ్రీ అని రాసి ఉంది. ఇంటికెళ్లి ప్యాకెట్ విప్పి చూస్తే అందులో ఏ మాత్రం షుగర్ లేదు. అందుకే అప్పటి నుంచి అక్కడకు వెళ్లడం మానుకున్నాను.

సముద్ర దొంగలు

ప్రస్తుతం సోమాలియా దేశంలో కరువు కాటకాలు రాజ్యమేలుతున్నాయి. ఎందరో ప్రజలు పిల్లలతో సహా ఆకలి చావులకు బలి అవుతున్నారు. అగ్రదేశాలు అణుబాంబుల తయారీ, కొత్త శస్త్రాస్త్రాల మీద వెచ్చిస్తున్న వందలాది బిలియన్ డాలర్లలో కొద్దిశాతం వెచ్చించినా ప్రపంచంలో ఆకలి చావులు ఉండవు. కానీ, ఆధిక్యత కోసం పోటీలు పడుతూ వినాశహేతువులైన, విధ్వంసక ఆయుధాల తయారీ పోటీ నుంచి విరమించుకోవనేది.. అందరికీ తెలిసిన సత్యం.

ఈ నేపథ్యంలో సోమాలియా దేశస్తుల్లో కొందరు ముఠాలుగా ఏర్పడి సముద్రదోపిడీకి పాల్పడుతున్నారు. చమురు ఓడల్ని, నావికా సిబ్బందిని హైజాక్, కిడ్నాపులు చేసి, మిలియన్ల కొద్దీ డాలర్లు చెల్లిస్తేనే విడిచి పెడుతున్నారు. గత కొద్దికాలంగా ఇలాంటి సంఘటనలు బాగా పెరిగిపోవడంతో భారత్‌తో సహా అనేక దేశాలు కలవరం చెందుతున్నాయి. సముద్ర చట్టాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. వ్యాపార నౌకల్లో ఆయుధాలు నిషిద్ధం కావడం సముద్ర దొంగలకి బాగా అలుసుగా తయారయింది. వీరి దాడికి దోపిడీకి ముడి చమురు నౌకలేగాక, సరుకుల నౌకలు, చేపలుపట్టే నౌకలు కూడా గురవుతున్నాయి. ప్రస్తుతం కౌలాలంపూర్‌లో మాత్రమే ఉన్న 'ఇంటర్నేషనల్ మారిటైమ్ బ్యూరో సముద్ర దొంగల దాడికి గురైన నౌకల ఆచూకీ తెలియజేస్తున్నది. ఒక్క 2008 మొదటి తొమ్మిది నెలల్లోనే 199 సంఘటనలు నమోదు అయ్యాయంటే సమస్య తీవ్రత అర్థం చేసుకోవచ్చు. నాటో, అమెరికా, రష్యాయుద్ధ నౌకలతో బాటు మన దేశ యుద్ధ నౌకలు కూడా ఎర్రసముద్రం, ఎడెన్ గల్ఫ్ ప్రాంతాల్లో పహారా చేస్తున్నా సమస్య తీవ్రత తగ్గలేదు. ఇటీవల సౌదీ అరేబియా నుంచీ అతిపెద్ద ముడి చమురు నౌక అమెరికాకు వెళుతూ కెన్యా దేశ తీరానికి ఆగ్నేయంగా నాలుగొందల నాటికల్ మైళ్ల దూరంలో సముద్ర దొంగల దాడికి గురైంది. ఒమన్ దేశ తీరానికి మూడొందల నాటికక మైల్స్ దూరాన ఉన్న సముద్ర దొంగలు మాతృనౌకని భారతయుద్ధ నౌక (INS) తబార్ ముంచివేసి సంచలనాన్ని సృష్టించింది. ఇప్పటి వరకు భారత్ కన్నా అధిక శక్తివంతమైన నౌకదళాలు అగ్ర రాజ్యాలు ప్రేక్షక పాత్ర పోషిస్తూ వచ్చాయి. సముద్రాల మీద వ్యూహాత్మక ఆధిక్యత కోసం పోటీ పడే అగ్రదేశాలు భారత్ పద్ధతిని అనుసరించేందుకు ముందుకు వచ్చాయి. కొందరు సముద్ర దొంగలు బందీలుగా దొరికారు. వారిని సముద్ర చట్టాల ఆధారంగా విచారించి శిక్షలు విధించారు.

కొత్త చట్టాలు : సముద్ర వాణిజ్యానికి విఘాతం కలిగిస్తూ, నౌక సిబ్బందిని బహుకాలం బందీలుగా ఉంచి మిలియన్ల కొద్దీ డాలర్లను డిమాండ్ చేస్తున్న సముద్ర దొంగల ఆటకట్టించడానికి కొత్త చట్టాలు తయారువుతున్నాయి. ఇకపైన వాణిజ్య నౌకల్లో ఆత్మరక్షణ ఆయుధాలను అనుమతించే అవకాశాలు కన్పిస్తున్నాయి.

- కాటూరు రవీంద్ర త్రివిక్రమ్,
న్యాయ నిపుణులు

ప ద వి కా సం 164

కూర్పు : రావెళ్ల

1		2		■	3	4		5
	■		■	6	■		■	
7		■	8			■	9	
	■	10	■		■	11	■	
■	12			■	13			■
14	■		■	15	■		■	16
17		■	18			■	19	
	■	20	■		■	21	■	
22				■	23			

ఆధారాలు

అడ్డం

1. పడవదారి (4)
3. నిరాకరణ (4)
7. ఆడకప్ప (2)
8. మూషికం (3)
9. కుడి నుంచి పుడమి (2)
12. ఒక పువ్వు (3)
13. పిరికి (3)
17. కోతి (2)
18. రైలు పెట్టెలు (3)
19. అధికమైన (2)
22. అభ్యాసం (4)
23. పడిపోవు (4)

నిలువు

1. విజయ సూచకంగా మోగించే ఢంకా (4)
2. గుళిక (2)
4. ఉన్ని దుప్పటి (2)
5. సాము చేసే చోటు (4)
6. వాడి అయినది (3)
10. తలగడ (3)
11. దగ్గరి చోటు (3)
14. ఉడికే ధ్వని (4)
15. గెలవాలనే కోరిక (3)
16. కలిసిపోవు (4)
20. హద్దు (2)
21. ఒక పంట (2)

గతవారం జవాబులు

1 జ	ల	2 గ	లు	■	3 తో	4 ట	మా	5 లి
ల	■	తి	■	6 త	■	పా	■	గ
7 జీ	ర	■	8 త	త్త	ర	■	9 తా	ర
వి	■	10 త	■	డి	■	11 త	■	తి
■	12 త	ప	న	■	13 ము	ప్పి	డి	■
14 మ	■	సి	■	15 యా	■	దం	■	16 న
17 ర	ణం	■	18 లో	చ	నం	■	19 వా	డి
మ్మ	■	20 సా	■	న	■	21 ఉ	■	నె
22 తు	21 షా	రా	ద్రి	■	23 అ	త్రి	ప	త్రి

సుడోకు

7		2	6		9			1
	6		1	5				7
	1			8	2	3		
				3		5		8
5			8		7		1	
				2				9
		9		7				
	4	6		1				
		8	5					4

6	8	4	7	2	5	9	3	1
7	3	5	1	6	9	8	4	2
9	1	2	3	8	4	5	6	7
2	5	6	4	9	7	3	1	8
8	9	1	2	3	6	4	7	5
3	4	7	5	1	8	2	9	6
1	2	8	6	4	3	7	5	9
4	7	9	8	5	1	6	2	3
5	6	3	9	7	2	1	8	4

లెక్కించండి

	+	6	=	11
+	■	+	■	+
9	+		=	10
=	■	=	■	=
	+		=	

1 పజిల్

గతవారం జవాబులు

1 పజిల్‌కు సమాధానం
మొదటి వరుసలో 4, రెండవ వరుసలో 9
చివరి వరుసలో 8,13 చివరి గడిలో (21)
2 పజిల్‌కు సమాధానం (14 1/2)



2 పజిల్

ఈ పజిల్స్‌కి జవాబులు వచ్చేవారంలో ....

బ్రెడ్ ఊతప్పం

కావల్సినవి :

బ్రెడ్ - 20 స్లైసులు, మజ్జిగ - 3 కప్పులు (కొంచెం పుల్లగా ఉంటే బాగుంటుంది), బియ్యం పిండి - రెండు చెంచాలు, ఉల్లిపాయలు - రెండు, పచ్చి మిరపకాయలు - ఆరు, క్యారెట్ - ఒకటి, బీన్స్ - ఆరు, టమోట - ఒకటి, అల్లం - చిన్నముక్క, ఉప్పు - తగినంత, కారం - అరచెంచా, కరివేపాకు - రెండు రెబ్బలు, కొత్తిమీర కట్ట, నెయ్యి - రెండు చెంచాలు, నూనె - తగినంత.

తయారీ :

శాండ్‌విచ్ బ్రెడ్ తీసుకుని అంచులు తీసేసి చిన్నచిన్న ముక్కలుగా చేసి మజ్జిగలో నానబెట్టుకోవాలి. ఓ బాణలిలో నెయ్యి వేసి పోపు పెట్టి వేగిన తరువాత సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, క్యారెట్, బీన్స్, పచ్చిమిర్చి, అల్లం, టమోట ముక్కలు వెయ్యాలి. ఇవి కొంచెం వేగిన తర్వాత ఉప్పు, కారం వేయాలి. ఈ మిశ్రమం కొంచెం మగ్గిన తరువాత తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మజ్జిగలో నానిన బ్రెడ్ ముక్కలు, బియ్యం పిండి, మిగిలిన మజ్జిగ కలిపి మెత్తగా రుబ్బుకోవాలి. దీనిని వేయించి పెట్టుకున్న మిశ్రమానికి కలిపి ఉల్లిపాయలు, కరివేపాకు, కొత్తిమీరలను వేసి పెనంపై ఊతప్పంలా వేసుకుంటే సరి. రుచిరుచిగా ఉండే ఈ బ్రెడ్ ఊతప్పం ఏ చట్నీతో అయినా రుచిగా ఉంటుంది.

రుచి

బ్రెడ్ దోసె

కావల్సినవి :

బ్రెడ్ పొడి - 1 కప్పు, చిక్కగా ఉన్న మజ్జిగ - 1 కప్పు, మైదా - అర కప్పు, బొంబాయి రవ్వ - అర కప్పు, క్యాప్సికమ్ ముక్కలు - పావు కప్పు (సన్నగా తరిగినవి), పచ్చిమిర్చి ముక్కలు - పావు కప్పు, జీలకర - చెంచా, వంటసోడా - చిటికెడు, నూనె - దోసె కాల్చడానికి సరిపడా, ఉప్పు - తగినంత.

తయారీ :

ముందుగా బ్రెడ్‌ను ఎండబెట్టి, మిక్సీలో వేసి పొడి తయారుచేసుకోవాలి. ఈ బ్రెడ్ పొడిలో మైదా, బొంబాయి రవ్వ, వంట సోడా వేసి, నీళ్ళతో కలపాలి. తర్వాత క్యాప్సికం ముక్కలు, ఉప్పు, జీలకర, పచ్చిమిర్చి ముక్కలు చేర్చి మజ్జిగ పోస్తూ జారుగా దోసె పిండిలా కలుపుకోవాలి. పెనం కాలిన తరువాత, నూనె వేసి దోసెలు వేసుకోవాలి.

సెట్ దోసె

కావల్సినవి :

మినప్పప్పు - 1 కప్పు, బియ్యం - 3 కప్పులు, అటుకులు - 1 కప్పు, మెంతులు - 1 టీ స్పూను, నూనె - అర కప్పు, ఉప్పు - రుచికి తగినంత.

తయారీ :

మినప్పప్పు, బియ్యం, అటుకులు, మెంతులు కలిపి కనీసం 4 గంటలు నానబెట్టాలి. మిక్సీలో వీటన్నిటినీ మెత్తగా రుబ్బుకుని, ఉప్పు కలిపి 8 గంటలపాటు పులియబెట్టాలి. పిండి పలచగా కాకుండా చిక్కగా ఉండాలి. పెనంపైన మామూలు దోసెల్లా పెద్దగా కాకుండా పూరీల సైజులో (అరంగుళం దళసరిగా) వేసుకుని రెండువైపులా దోరగా కాల్చుకోవాలి. ఇష్టమైతే పైన క్యారెట్ సన్నటి తురుము (ఒకవైపు) పలచగా చల్లుకుంటే చూడ్డానికి అందంగా ఉంటాయి. ఈ దోసెలు వేడిమీద ఆలూ కుర్మాతో తింటే ఎంతో రుచిగా ఉంటాయి.

ఫిట్‌నెస్ డ్యాన్స్

'స్కైడ్రైవ్ స్పోర్ట్స్ డ్యాన్స్' గత కొద్ది కాలంగా ఈ డ్యాన్స్ బాగా వైరలై కాంపిటీషన్లు కూడా నిర్వహిస్తున్నారు. అసలు స్పోర్ట్స్‌కి, డ్యాన్స్‌కి సంబంధం ఏంటనుకుంటున్నారా..? స్పోర్ట్స్ ఒక్కటే ఫిట్‌నెస్ పెంచుతుందనుకుంటే... పొరపాటు పడినట్లే... ఈ డ్యాన్స్ పబ్లిసిటీ కోసమే కాదండీ, ఆరోగ్యం కోసం కూడా ఎంతో అవసరం అంటున్నారు నిపుణులు. ఈ విధమైన డ్యాన్స్ చేయడం వల్ల ఎంతో ఉల్లాసంగానూ ఆరోగ్యంగానూ ఉంటున్నారని ఈ మధ్య కాలంలో బి-ఫిట్ అనే సంస్థ వారు నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడించారు. క్రికెట్‌లో, టెన్నిస్‌లో చీర్ గాళ్స్ చేసే డ్యాన్సే కదా! అని తీసిపారేయకండీ... గత కొద్ది రోజులుగా అనేక టూ వీలర్, ఫోర్ వీలర్స్ వారు స్కైడ్రైవ్ స్పోర్ట్స్ డ్యాన్స్ కోసం తీవ్రంగా గాలిస్తున్నారట. అందుకే ఈ డ్యాన్సర్లకు కాంపిటేషన్లు నిర్వహించి తద్వారా వారి కంపెనీకి పబ్లిసిటీ కోసం ఎంచుకుంటున్నారు. కాబట్టి ఈ డ్యాన్స్‌కి ఎంతో క్రేజ్ పెరిగిపోయిందిప్పుడు. అందుకే ఎక్కడ చూసినా యువత కొత్త రకం థీమ్ తీసుకుని ఈ డ్యాన్స్‌ను చేసేస్తుంది. కాంపిటీషన్‌లో పాల్గొనకపోయినా ఆరోగ్యం కోసమైనా ఈ డ్యాన్స్‌ను నేర్చుకుంటే మంచిదేమో...!

ఓ జీవితం...!

'ఏ సోషల్ లైఫ్' Meredith అనే యువతి తాను సామాజిక మాధ్యమంలో పోటీగా నిలవాలని ఆమె కల గురించి తెలుపుతుంది. చివరకు అది విఫలమవడంతో తట్టుకోలేక సామాజిక మాధ్యమాన్నే వదిలేస్తుంది. ఆ మానసిక సంఘర్షణ మనకు ఇందులో స్పష్టంగా కనపడుతుంది. ప్రస్తుతం ఉన్న ఆధునికత పరిస్థితుల్లో సామాజిక సంబంధాలకు దూరంగా ఉంటూ తమకంటూ ఒక స్థానం ఉండాలని కోరుకునేవారు ఈ షార్ట్‌ఫిల్మ్‌ను తప్పక చూడాలి. తమ సొంత అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తపరచలేనివారు, సామాజిక మాధ్యమం ద్వారా వ్యక్తపరచడం. పొద్దున్నే నిద్రలేచినప్పటి నుంచీ రాత్రి పడుకునే వరకూ తాము చేస్తున్న ప్రతి అంశాన్ని పిక్ తీసి ఫేస్‌బుక్‌లో పోస్టు చేయడం వంటివి చేస్తూ ఉండటం.. తాను వాకింగ్ కోసం వేసుకునే షూష్ నుంచీ, చేస్తున్న పనిని, తాను తీసుకోబోయే ఆహారాన్ని సైతం పెడుతూ తానొక ఇండిపెండెంట్‌గా ఫీల్ అవుతూ తానే గొప్ప

జీవితాన్ని అనుభవిస్తున్నట్లు ఇందులోని ప్రధానంగా చూపిన అంశం. సోషల్ మీడియా డిప్రెషన్‌కు లోనవుతూ.. తాను పెట్టిన పోస్టుకు ఎవరెవరు స్పందిచారో లేదో నిమిషానికి పదిసార్లు చూసుకోవడం నేటి యువతకు అత్యంత ప్రమాదకరమైన జబ్బుగా చూపించారు డైరెక్టర్ కిరీట్ లీమోన్. చివరకు తాను పెట్టిన తన ఫోటోకు ఎటువంటి స్పందన రాకపోయేసరికి... సామాజిక మాధ్యమాన్ని వదిలి బయట ప్రపంచానికి వెళు తుందా అమ్మాయి. ఈ షార్ట్ ఫిల్మ్ ముఖ్యంగా నేటి యువత తప్పక చూడదగ్గది.

బొమ్మల కథ

స్నేహమే సాహసంగా..

'డేంజర్ ఇన్ గార్డెన్' యానిమేషన్ లఘుచిత్రం... ఇందులో మూడు కుందేళ్లు ఎంతో ఉత్సాహంతో, స్నేహపూర్వంగా మెలుగుతాయి. తమ గార్డెన్‌లో ఎన్నో రకాల కూరగాయలు, పండ్లను పండిస్తుంటాయి. అయితే వారి గార్డెన్‌లో ఓ వ్యక్తి పిల్లిని కాపలాపెట్టి అతను వాటిని అక్రమంగా వ్యాపారం కోసం అక్కడ నుంచి తరలిస్తుంటాడు. ఆ ప్రమాదం నుంచి గార్డెన్‌ను కాపాడుకోవడానికి ఈ మూడు కుందేల్లు కలిసికట్టుగా ఎంతో సాహసోపేతమైన అడ్వంచర్స్‌ను చేస్తాయి. ఎన్నో విషయాలను తెలుసుకుంటాయి. ఏ ఒక్క క్లూనీ వదిలిపెట్టకుండా శోధించడం ప్రారంభిస్తాయి. అందుకు ఒకరికొకరు ఎంతగానో బాధ్యతగా సహాయపడుతుంటాయి. ప్రతి చిన్నవిషయాన్ని చర్చించుకుంటూ ఏం చేయాలో నిర్ణయించుకుని పక్కా ప్లాన్‌గా చేయడం వల్ల అన్నీ సఫలీకృతం అవుతుంటాయి. ఇలా సాగుతుండగా ఆ మూడు కుందేళ్లతోపాటు మరో బుజ్జి కుందేలు వచ్చి వారికి సహాయపడుతుంది. ఈ లఘుచిత్రాన్ని చూస్తున్నంత సేపు సరదాగా సాగిపోతూ బ్యాగ్రౌండ్ మ్యూజిక్‌తోపాటు కొన్ని డైలాగులతో ఆహ్లాదకరంగా సాగుతుంది. కలిసికట్టుగా ఉంటే దేన్నైనా సాధించగలమనే మంచి విషయాల్ని తెలుపుతుంది.

సుచిత్రమ్

కోరల్ కన్నీళ్లే కళావస్తువు..!

పగడపు దిబ్బలు దెబ్బతింటే.. సముద్రానికి జబ్బు చేసినట్టే..! మరి వాటితో కళకళలాడే కోరల్ ట్రయాంగిల్ హృదయస్థానంలో ఉంది ఇండోనేషియా..! 'అమెజాన్ ఆఫ్ ది సీ'గానూ పేరుగాంచిన ఈ ప్రాంతంలో పగడపు దిబ్బల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. వాతావరణ మార్పులు, కాలుష్యాల వల్ల ఇవి నష్టపోతున్నాయి. బ్లీచింగ్ వల్ల నాశనమవుతున్నాయి. ఈ చిత్రాన్నే హృద్యంగా చిత్రీకరించింది జకార్తాలోని అమెరికా ఎంబసీ గోడల మీద సెరామిక్ కళాకారిణి కోర్ట్నీ మాట్టిసన్. చిన్నతనం నుంచి సముద్రంతో కలగలసిన ఆమె అనుభూతులు, అనుభవాలతో ఆమె పర్యావరణవాదిలా మారింది. కళాశాల విద్యార్థి జీవితంలో గ్రేట్ బ్యారియర్ రీఫ్ వద్ద తొమ్మిది నెలలు గడిచాయి. స్కూబా డైవ్‌తో పగడపు దిబ్బల అద్భుతాల్ని చూశాక, మెరీన్ బయాలజీ చేసింది. రోడ్ ఐలాండ్ స్కూల్ ఆఫ్ డిజైన్‌లో కోర్సు చేసి తన కళతో సముద్ర పర్యావరణ పరిణామాల్ని ప్రపంచం కళ్లెదుటుంచే ప్రయత్నం చేస్తోంది. 'అవర్ చేంజింగ్ సీస్' (మారుతోన్న మన సముద్రాలు) పేరిట ఆమె సెరామిక్ ఆర్ట్‌పీసెస్ సృజిస్తోంది. వైవిధ్యమైన రంగులు, ఆకృతులతో ఆకట్టుకునే సజీవంగా కనిపించే పగడపు దిబ్బల నమూనా కేంద్రంగా తీసుకుని, దాని చుట్టూ వాటి మృత్యుముఖాన్ని బయటపెడుతోంది. కోరల్స్, అనిమోన్స్, స్పాంజెస్ వంటి జీవుల మోడళ్లతో సైక్లోన్ కన్ను రూపాన్ని తెస్తుంది. గ్రేడియెంట్ షిఫ్ట్‌తో ఆ రెండు పార్శ్వాల్ని ప్రదర్శించడం వల్ల పగడపు దిబ్బలకు, సముద్రాలకు ఏమౌతోందనే విషయం చూపరులకు తెలుస్తుంది. 'ఆఫ్టర్ గ్లో', 'కాన్ఫ్లూయెన్స్', 'కోరల్ యూనివర్స్' వంటి కళాఖండాలు పేరొందాయి. బాలిలోని సానుర్ కోరల్ ట్రయాంగిల్ సెంటర్‌లో 60 అడుగుల కోరల్ ఇన్‌స్టాలేషన్ తీర్చిదిద్దింది. దీనిలో 2000 ఎలిమెంట్స్ ఉంటాయి. దాదాపు 300 మంది ఆర్ట్ వలంటీర్లు, పగడపు దిబ్బల పరిరక్షకులు ఈ ప్రాజెక్ట్‌లో చేతులు కలిపారు.



కవిత్వమ్

ఆకుపచ్చని కన్నీరు

ఎంత వేడి
పుట్టించినా మట్టి
పొరలు వ్యాకోచించవు
తలపోతల్లో ఎంత
తవ్విపోసినా
లోతుపూడదు...
ఈదురు గాలికి వెన్ను కంకులు
విరిగిపడుతున్న కాలంలో
నిన్నటి తరానికి నువ్వొక తలపాగావు
మంచె మీద నిలబడి ఎన్ని వడిసెలలు
తిప్పి ఉంటావు

• •

నిన్ను నువ్వే విత్తనంలా పాతుకుని
పంటగా రూపాంతరం చెందినప్పుడు
నువ్వొక పాదుకట్టిన మొక్కవి
ఎదిగిన పంటకి ఎరువువి
కనీసధర పలకని వేలం పాటవు
దోసిట నిండా చేదుకుని
ఎన్నిసార్లు దు:ఖాన్ని తాగిఉంటావు

• •

ఆత్మహత్యానంతర
ప్రయోగశాల పరీక్షల్లో
నీ ఊపిరితిత్తుల నిండా
కల్తీలేని ఆక్సిజన్ ఆనవాళ్లు
వాగ్దానాలది ఇనుప హస్తాల
కరచాలనం...
హామీ అంటే మోసమని
నిఘంటువుల భాష
చిగురించడమే తెలిసిన నేల
ఇప్పుడొక ఫోటో ప్రదర్శనశాల
నీ బలంతో గట్టుకోసం
గొడవపడిన చోటంతా ఇప్పుడు
శిలాఫలకాల బొమ్మల కొలువు
ఇళ్లు బాధలకి పర్యాయపదాలు

• •

ఎప్పుడో బీడు భూమిలో తాత
నాగలికర్రు మోపిన చోటంతా
కొత్త జీవోల కలుపు మొక్కలు
అప్పటిదాకా నాన్న పండించిన
ఎర్ర మిరపపంట లిప్‌స్టిక్ రంగులోకి మారి
కార్పొరేట్ కంపెనీ బ్రాండ్ లేబిల్ ఐపోతుంది
ఒకప్పుడు మంచాల కింద దొర్లాడిన
కూరగాయలు మాల్స్ కవర్లలో ఊపిరాడక
చల్లగా గడ్డకట్టిపోతాయి
ఎన్ని నగలు మట్టిబెడ్డల్లా కరిగిపోతాయో..!
ఎన్నిసార్లు కన్నీటి జాలాట్లో నువ్వలా
కలిసిపోయావో కదా ఆ పంట ప్రాణాల కోసం
జనసత్వాలు ఉడిగిపోయాక
తుప్పు పట్టిన వ్యవసాయ పనిముట్టుకి
జమ్మిచెట్టు ఆసరా అక్కర లేదు

నీ బాధ ఒక కమోడిటీ
వ్యధ ఒక రుణమాఫీ
నువ్వొక తాకట్టు వస్తువు
నువ్వొక పావలా వడ్డీ
ఈ దేశంలో పాతబడ్డ పేదరిక నినాదాన్ని
నీ తరపున ఎవడో గెలిచేశాడు
ఇప్పుడు నువ్వొక స్వతంత్రుడివి
ఎంత చుట్టినా మళ్లీ
ముడుచుకుపోయే
సిరిచాపలా పంట భూమంతా
అదృశ్య చేతులతో చుట్టబడ్డాక
సాగు చేసేవాడి
మరణం అసందర్భ సంగతి

వాన ప్రియురాలా..!
ఇప్పుడిక నల్ల మాగాణులని
తడపాల్సిన అవసరం లేదు..!
ఎర్రటి ఎండవేళ చల్లటి ప్రేమ పారిన
నీ ఇంటి పంచపాళి అంతా నిర్మానుష్యం..
గాదెలు, ఒడ్లు బస్తాలు నిన్నటి కలలు
ఇప్పుడిక నీది పడక్కుర్చీ సాంగత్యం
తెల్లకాగితాలపై అర్థంకాని
ఆర్కిటెక్చర్ నల్లగీతల్ని చూస్తూ
పెరగబోతున్న వృద్ధి రేటుని ఊహించుకుంటూ
ఉచిత పెన్షన్ కోసం వేలిముద్రలు పడతాయా
లేదా అని తమాయించుకుంటూ..
ఒంటరి పాదయాత్రలో ఒట్టికాళ్లతో
చివరి యాత్ర కోసం నడిచిపోవడమే



అంతస్తుల వనాల వేర్లకి రైతుల
అస్థిపంజరాలు అడ్డమొస్తాయి
రాలిపోబోతున్న 33 వేల ఎకరాల ఆత్మల
బొమికలు ఏ పాలరాతి పలకల కింద పాతాలి
సామంతుడి రాజ్యాంగం అందుకు ఒప్పుకోదు
నువ్వుపోయాక నిన్ను నువ్వే
ఖననం చేసుకోవడానికి
నీ దేహపు వాసన అడ్డం వస్తుంది..!
కప్పడానికి మట్టిదుప్పట్లేమీ సిద్ధంగా లేవిక్కడ
నీ అసమాన త్యాగం...,
కొత్త రాజధాని పునాదులకి మూలస్తంభమని
నాలుగో ఎస్టేట్ గొప్ప పతాక శీర్షిక రాస్తుంది
ఇప్పుడిక నువ్వు పైకి మిలమిలా మెరుస్తున్న
నున్నని తారు రోడ్డు కింద
నలిగిపోయిన డొంకదారివి..
ఫౌంటెన్ నుంచి అందంగా ఎగసిపడుతున్న
నీరంతా నీ ఆకుపచ్చని కన్నీరు..!

- అనిల్ డ్యానీ
97033 36688

నాన్న

నీలాకాశంలాంటి
తన దేహాన్ని నీ కోసం
గొడుగుగా మార్చి
నీడను ఇచ్చేవాడు నాన్న..!
నీ జీవిత రథానికి తన భుజాలను
చక్రాలుగా చేసేవాడు..
నీ పాదాలకు తన చేతులను
చెప్పలుగా తొడిగేవాడు..
నీ బతుకు పాటకు తన నరాలను
తీగలుగా మలచి,
నేపథ్య సంగీతంగా అందించేవాడు..
నీ ఒంటిని కనురెప్పలా కాస్తూ
నీ కంటికి కనిపించని కవచమే
నాన్న..!

- సురేంద్ర రొడ్డ
94915 23570